


అధికార వైసీపీలో వేరుకుంపట్ల రాజకీయం తారస్థాయికి చేరింది. పార్టీలో ఉన్న ఎంపీ మాగుంటను ఒంగోలులో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలనకు కూడా ఆహ్వానించ లేదు. మరోవైపు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సీనియర్ నాయకుడు డాక్టర్ గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యతోపాటు మరికొందరు నేతలు టీడీపీ, జనసేన కూటమి వైపు దృష్టి సారించారు. మంత్రులు నాగార్జున, సురేష్ కొత్త ఇన్‌చార్జిలుగా నియమితులైన నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ పార్టీపరంగా పాలనా బాధ్యతలు చూసిన వారిని కానీ, వారి అనుచరులను కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైసీపీలో పరిస్థితి గందరగోళంగా మారింది.

వైసీపీలో వేరుకుంపట్లు

» వికటిస్తున్న జగన్ నిర్ణయాలు » ఎక్కడికక్కడ అలకలు, అసంతృప్తులు

» సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు మాగుంటకు లేని ఆహ్వానం
» కార్యక్రమాలకు దూరంగా ముగ్గురు ఎమ్మెల్యేలు
» టీడీపీ, జనసేన కూటమి వైపు గరటయ్య, కృష్ణచైతన్య చూపు

కొత్త ఇన్‌చార్జిల ఒంటెత్తుపోకడ

కొత్త ఇన్‌చార్జిలు స్థానిక నాయకులను గౌరవించడం లేదన్న విమర్శలు వైసీపీ నాయకుల నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలో మంత్రి నాగార్జున అయితే అధికారికంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయించుకుని వెళ్లి వస్తున్నారే తప్ప స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వడం లేదు. ఇక ఆయా నియోజకవర్గాలలో స్థానిక నాయకులతో సంబంధం లేకుండానే బదిలీల వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులు ఉడికిపోతున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలంలో స్థానిక నాయకులంతా ప్రత్యేకంగా సమావేశమై నాగార్జున వైఖరిని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు గెలిచాక ఏడాదికి ప్రారంభించిన నాయకులను విస్మరించే చర్యలను నాగార్జున తొలి నెలన్నరకే ప్రారంభించారంటూ ఆపార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలలో పరస్పర బదిలీలతో బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డిలకు ఎక్కువ ప్రాంతాల్లో స్థానిక నేతల నుంచి చుక్కెదురవుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరై ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమాలలో పాల్గొన్న నాయకులు కూడా ఎమ్మెల్యేలు వారివారి కొత్త నియోజకవర్గాలలో పర్యటనలు ప్రారంభిస్తే ముఖం చాటేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అభ్యర్థుల మార్పుపై సీఎం జగన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు మరింత వికటిస్తున్నాయే తప్ప ఏమాత్రం కుదుటపడటం లేదు. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఆపార్టీలో నెలకొన్న పరిస్థితులు అందుకు దర్పణం పడుతున్నాయి. పార్టీలోనే ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంటతోపాటు ముగ్గురు ఎమ్మెల్యేలను కనీసం కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నారు. జిల్లా, నియోజకవర్గస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు వైసీపీకి గుడ్ బై చెప్పేవారి సంఖ్య పెరిగిపోతోంది. దీనికితోడు కొత్తగా పార్టీ ఇన్‌చార్జిల బాధ్యతలు చేపట్టిన నాయకులు ఒంటెత్తుపోకడ విధానాన్ని అవలంబిస్తుండటంతో ఆపార్టీలో ఉన్న నాయకులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. కొత్త ఇన్‌చార్జిల పోకడపై ఎక్కడికక్కడ సమావేశాలు ఏర్పాటు చేసుకుని తమ నిరసనను బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు.


ఒంగోలులో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు సురేష్, నాగార్జున, ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్ దినేష్‌కుమార్

మాగుంటను దూరం పెట్టారు..

ఒంగోలు లోక్‌సభ స్థానానికి పోటీచేసే పార్టీ అభ్యర్థిని జగన్ ఇంతవరకూ అధికారికంగా ప్రకటించ లేదు. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇప్పటికీ వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఆయన విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పార్టీ అధినే తల నుంచి జిల్లా నాయకుల వరకూ కొన్ని వ్యాఖ్యానాలు చేసినా మాగుంట నోరుమెదపలేదు. అలాగని నియోజకవర్గానికి కూడా దూరం కాలేదు. ఎప్పట్లాగే వారంలో రెండుమూడు రోజులు ఒంగోలులోనూ, నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లోనూ తిరుగుతున్నారు. వైసీపీ అధిష్ఠానం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రకటించింది. ఆయనే ఒంగోలు ఎంపీ అభ్యర్థి అవుతారని అనధికారికంగా సంకేతాలు ఇచ్చింది. దీంతో ఆయన ఒంగోలుకు పదేపదే రావడం, కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతోంది. ఆదివారం కూడా ఆయన ఒంగోలు వచ్చారు. శుక్రవారం ఒంగోలులో జరగనున్న సీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనితో మంత్రి సురేష్, చెవిరెడ్డి సమావేశమై సీఎం సభ జయప్రదానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకున్నారు. అనంతరం ముగ్గురూ కలిసి వెళ్లి సింగరాయకొండలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కానీ ఒంగోలులోనే ఉన్న ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కూడా ఆహ్వానించ లేదు. సోమవారం కూడా మంత్రుల సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన సమాచారం కూడా ఆయనకు లేదని తెలిసింది. ఆదివారం రాత్రి ఒంగోలులో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాగుంట హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం తరఫున ఆయన్ను ఆహ్వానించారే తప్ప వైసీపీపరంగా కానీ, పాలనాపరంగా అధికారులు నిర్వహించే కార్యక్రమాలకు కానీ ఆయన్ను పిలవకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న మాగుంట అనుచరులు, అభిమానులు క్రమేపీ వైసీపీ కార్యక్రమాలకు దూరమవుతున్నారు. మంత్రులు సురేష్, నాగార్జునలు వారివారి నియోజకవర్గాలలో నిర్వహించే కార్యక్రమాలకు కూడా మాగుంట అనుచరులు హాజరు కావడం లేదు.

కార్యక్రమాలకు హాజరుకాని ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు

కనిగిరి, దర్శి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు మధుసూదన్‌యాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, సుధాకర్‌బాబు నియోజకవర్గాల్లో ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. కనీసం వారిని పిలవకుండానే అధికారిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు లేకుండానే కొత్త ఇన్‌చార్జిలు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. దీంతో ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉంటూ వారికి మద్దతు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు కొత్త ఇన్‌చార్జిలు నిర్వహించే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాయి. కొన్ని నియోజకవర్గాలలో అయితే ఎమ్మెల్యేల అనుచరగణాన్ని కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదు. దీంతో వారివారి అనుచరులు వేరుకుంపట్లతో ముందుకు సాగుతున్నారు.

దర్శి వైపు చైతన్య దృష్టి

సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, నిన్న మొన్నటి వరకూ వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు కృష్ణచైతన్యలు వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వారు టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. అంతకు ముందు జనసేన నేత మనోహర్‌తోనూ భేటీ అయ్యారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గరటయ్యకు అద్దంకితోపాటు పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాలలో అనుచరగణం ఉంది. పలువురితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అద్దంకి నియోజకవర్గంలో అయితే పార్టీ యంత్రాంగంలో అత్యధికులు చైతన్యతోనే కలిసి నడుస్తున్నారు. చైతన్యతోపాటు పార్టీ వీడేందుకు సిద్ధమని ఆయన్ను కలిసి చెబుతున్నారు. వీరు టీడీపీ, జనసేన కూటమిలో దర్శి నియోజకవర్గం నుంచి పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారు. గరటయ్య అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎక్కువకాలం ప్రస్తుత దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు అద్దంకి సెగ్మెంట్‌లో ఉండేది. అలాగే ముండ్లమూరు మండల ప్రజలతో కూడా ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో దర్శి నియోజకవర్గంలో దీటైన అభ్యర్థిని దించే ప్రయత్నంలో ఉన్న టీడీపీ, జనసేన కూటమి చైతన్యపై దృష్టి సారించి సర్వే చేపట్టింది. ఇక జిల్లాలోని దాదాపు అన్ని నియోజక వర్గాలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరగడంతో ప్రస్తుతం అలకలు, అసంతృప్తులతో వేరుకుంపటి రాజకీయాలు నడుపుతున్న నాయకులు మున్ముందు వైసీపీకి మరింత షాక్ ఇచ్చే అవకాశం ఉంది.

మహీధర్, ఆమంచిల తీరూ అదే

కొత్త ఇన్‌చార్జిల నియామకం జరిగిన కందుకూరు, పర్చూరు నియోజకవర్గాలలోనూ అదేతరహా పరిస్థితి కనిపిస్తోంది. కొత్త అభ్యర్థి ఇంతవరకూ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలవలేదు. నియోజవకర్గంలోని పార్టీ శ్రేణులు మాత్రం జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించి దుమ్మెత్తిపోస్తున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో కొత్త ఇన్‌చార్జి బాలాజీ, మాజీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌లు కలిసే అవకాశం కనిపించడం లేదు. గత పదేళ్లుగా ఆ ఇద్దరూ చీరాల నియోజకవర్గంలో అటు రాజకీయంగా, ఇటు వ్యక్తిగతంగా విరోధులుగా ఉన్నారు. వారి మధ్య మాటలు కూడా లేవు. బాలాజీ కొత్తగా బాధ్యతలు చేపట్టినా ఆయన్ను పార్టీలోని చాలామంది మర్యాదపూర్వకంగా కూడా కలవడం లేదు.


ఒంగోలులోని కర్నూల్ రోడ్డులో తారుచిప్స్‌తో గుంతను పూడ్చుతున్న కూలీ

సీఎం వస్తేనే చేస్తారా!

» పాడైపోయిన రోడ్లకు పైపై మెరుగులు
» 23న వస్తున్నారని అధికారుల హడావుడి

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 19 : నగర వీధుల్లో ప్రయాణమంటేనే నరకం. అడుగడుగునా గుంతలు.. ప్రగతి లేదు, పాడు లేదు. ప్రజల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా పాలకులు, అధికారులు నాలుగున్నరేళ్ల నుంచి పట్టించుకున్న పాపానపోలేదు. కానీ సీఎం వస్తున్నారని అధికారులు హడావుడిగా నగరంలో ప్యాచ్ పనులు చేపట్టారు. ఈనెల 23న పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేసేందుకు జగన్ ఒంగోలుకు వస్తున్నారు. దీంతో నగరంలోని పలుప్రాంతాల్లో గోతులమయంగా మారిన రోడ్లకు మేకప్ వేస్తున్నారు. అంతా బాగుందని చూపేందుకు పైపై మెరుగులు దిద్దుతున్నారు. దీంతో పలు శివారు కాలనీల ప్రజలు తమ కాలనీల్లో కూడా ప్యాచ్ వర్క్‌లు చేసి రోడ్లు బాగుచేయాలని కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

వచ్చేనెల 3న పల్స్‌పోలియో

అధికారులు సమన్వయంతో పనిచేయాలని జేసీ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : జిల్లాలో జీరో నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ వచ్చేనెల 3వతేదీన జరిగే పల్స్‌పోలియోలో చుక్కలు వేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం సాయంత్రం వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 23,45,687 మంది ఉన్నారని, వారందరికీ విధిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. అంతకు ముందు వైద్యాధికారులు మాట్లాడుతూ జిల్లాలో 224 పల్స్‌పోలియో కేంద్రాలు, 1591 మొబైల్, 70 ట్రాన్సిట్ బూత్‌లను గుర్తించి వ్యాక్సిన్‌ను సరఫరా చేస్తున్నామని జేసీ దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై జేసీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 3న ఎంపిక చేసిన కేంద్రాల్లో, 4, 5 తేదీల్లో గృహాలను సందర్శించి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ప్రతి సచివాలయం, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, ముఖ్యకూడళ్లలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.


ఒంగోలులో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

వెల్లువెత్తిన నిరసనలు

» రాప్తాడు ఘటనపై మండిపడ్డ జర్నలిస్టులు
» పలుచోట్ల ర్యాలీలు, ధర్నాలు
» ఉన్నతాధికారులకు వినతులు

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం జర్నలిస్టుల నిరసనలు వెల్లువెత్తాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణ రహితంగా దాడిచేసిన విషయం విదితమే. ఆ ఘటనపై జిల్లాలోని జర్నలిస్టులు మండిపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన, మీడియాపై దాడులు నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఎక్కడికక్కడ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు పలుచోట్ల ఈ ఆందోళనలు ఏపీయూడబ్ల్యూజే నాయకుల నేతృత్వంలో సాగాయి. ఒంగోలులో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కనకయ్య నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కాపురంలో జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ సీనియర్ నాయకుడు ఏవీ రమణ, ఇతరులు పాల్గొన్నారు. పొదిలిలో జర్నలిస్టుల ర్యాలీ, రాస్తారోకో నిర్వహించగా దర్శిలో డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కనిగిరి, కొండపి, నాగులుప్పలపాడు సింగరాయకొండ తదితర పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టి రెవెన్యూ, పోలీస్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అలాగే తెలుగుదేశం పార్టీ నేతలు కూడా ఈ పాశవిక దాడిని ఖండించారు. వాస్తవాలను వెలికితీయడాన్ని తట్టుకోలేని వైసీపీ గూండాలు దాడులు చేయడం దారుణమని టీడీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు.

23న ఒంగోలుకు సీఎం రాక

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యే, కలెక్టర్



ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 23వతేదీన ఒంగోలు రానున్నారు. నగరానికి సమీపంలోని అగ్రహారం వద్ద జరిగే బహిరంగ సభలో అర్హులైన పేదలకు ఇంటి స్థల పట్టాలను పంపిణీ చేస్తారు. సీఎం పర్యటన ఖరారవడంతో సోమవారం సాయంత్రం రాష్ట్రమంత్రులు సురేష్, మేరుగ నాగార్జున, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంలు ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి మేరకు నగరంలో అర్హులైన 22వేల మంది పేదలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మరో మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద కార్యక్రమం ఈనెల 23న ఒంగోలులో జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు 536 ఎకరాల భూసేకరణ చేశామన్నారు. 22వేల మందికి ఈనెల 23న పట్టాల పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పీఎంశ్రీ స్కూళ్లకు రూ.2.33 కోట్లు మంజూరు

ఒంగోలు (విద్య), ఫిబ్రవరి 19 : జిల్లాలోని 15 పీఎంశ్రీ పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం రూ.2.33 కోట్లు మంజూరు చేసింది. జిల్లాలోని గణపవరం కేజీబీవీ, కంభంలోని ఏపీ సాంఘిక గురుకులం, బాలుర ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, సింగరాయకొండ బాలికల ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, అర్ధవీడు జీహెచ్‌ఎస్, ఇప్పగుంట జడ్పీ స్కూలు, కాకర్ల, కలుజువ్వలపాడు, కామేపల్లి, మర్లపాడు జడ్పీహెచ్‌ఎస్, ముండ్లపాడు, రాయవరం, ఉప్పలపాడు జడ్పీ హైస్కూళ్లకు ఈ నిధులను కేటాయించింది. వీటిని ప్రయోగశాలల నిర్మాణం, పరికరాలకు వినియోగిస్తారు. ఒక్కో ల్యాబ్‌కు రూ.15.58 లక్షలు వెచ్చిస్తారు. ల్యాబ్‌ల నిర్మాణానికి ఒక్కో పాఠశాలకు మొదటి విడత రూ.2లక్షల చొప్పున రూ.30లక్షలు విడుదల చేస్తూ సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు.

దొంగ ఓట్ల తొలగింపునకు చర్యలు

» ఫాం-7లు పెట్టిన బీఎల్వో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీసీపల్లి, ఫిబ్రవరి 19 : స్థానికేతరులకు ఓటుహక్కు కల్పించి తప్పిదాలకు పాల్పడిన ఎన్నికల అధికారులు కదిలారు. తప్పులను సరిదిద్దుకునేందుకు హడావుడిగా ఫాం-7లు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మురుగుమ్మి బూత్ నెంబరు 216లో స్థానికేతరులైన తెలంగాణకు చెందిన నవీన రామారం, దేవేంద్రరెడ్డి రామారం, పద్మ వీరెడ్డిలకు ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో ఓటుహక్కు కల్పించారు. స్థానిక టీడీపీ శ్రేణులు ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో వీరు ముగ్గురు తమ గ్రామానికి చెందిన వారు కాదని, తెలంగాణకు చెందిన వ్యక్తులని గుర్తించారు. దీనిపై 'కొత్త జాబితాలోనూ దొంగ ఓట్లు' అన్న శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు స్థానికేతరుల ఓట్లపై ఆరాతీశారు. దీంతో క్షేత్రస్థాయి బూత్ లెవల్ అధికారి ఆ మూడు స్థానికేతర ఓట్లను తొలగించేందుకు ఫాం7లను ఆగమేఘాలపై దరఖాస్తు చేశారు.


పొన్నలూరు చెరువులో తుమ్మచెట్లను తొలగించేందుకు సిద్ధంగా ఉన్న ఎక్స్‌కవేటర్

కలప దొంగలు

» పొన్నలూరు చెరువులో ఇష్టానుసారం చెట్లను నరికివేస్తున్న వైసీపీ నేతలు
» టన్ను రూ.4,500కు విక్రయం
» పట్టించుకోని అధికారులు
» ప్రభుత్వ ఆదాయానికి రూ.లక్షల్లో గండి

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 19 : పొన్నలూరు చెరువులో కలప దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు చిల్లచెట్లు, తుమ్మచెట్లను ఎక్స్‌కవేటర్ల సాయంతో తొలిగిస్తున్నారు. కట్టె, మొద్దులను అమ్ముకొని రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికే చెరువులోని చిల్లచెట్లను నరికి విక్రయించిన వారు, ఇప్పుడు దశాబ్దాలుగా అటవీశాఖ పెంచిన తుమ్మచెట్లను తొలగిస్తున్నారు. వాటిని పొగాకు కాల్పు కోసం బ్యారన్‌ల వారికి అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు.


చెరువులో నరికిన తుమ్మ కట్టెలతో వెళ్తున్న ట్రాక్టర్

అటవీశాఖ అనుమతి లేదు...

పీడబ్ల్యూడీ చెరువుల్లో గతంలో అటవీశాఖ తుమ్మచెట్లను వేసింది. ఇవి పెరిగాక ఆశాఖ అనుమతితో గ్రామ పంచాయతీ బహిరంగంగా టెండర్ పిలిచి అధికంగా కోడ్ చేసిన వారికి చెట్లు కొట్టుకునేందుకు అనుమతివ్వాలి. వచ్చిన ఆదాయం అటవీశాఖ, గ్రామ పంచాయతీలకు దామాషా పద్ధతిలో లభిస్తుంది. అయితే ఇక్కడ అటువంటిదేమీ జరగలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వైసీపీ నాయకులు చిల్ల, తుమ్మచెట్లను ఇష్టానుసారం కొట్టుకుని వెళ్తుంటే అటవీశాఖ అధికారులు కానీ, గ్రామ పంచాయతీ అధికారులు కానీ పట్టించుకున్న పాపానపోలేదంటున్నారు. వీరికి అధికార పార్టీకి చెందిన నాయకులు కొంత సొమ్ము ముట్టజెప్పి చెట్లు కొట్టి విక్రయించుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

ఇప్పటికే వందల టన్నులు విక్రయం

వైసీపీ నాయకులు ఆర్నెల్లుగా చెరువులోని చెట్లను ఇష్టానుసారం కొట్టుకుని విక్రయించుకుంటున్నారు. ఇప్పటికే వందల టన్నుల కలపను అమ్ముకున్నారని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. ఈ ఏడాది పొగాకు క్యూరింగ్ కట్టెకు గిరాకీ ఉంది. టన్ను ధర దాదాపు రూ.4,500 వరకూ పలుకుతోంది. దీంతో వైసీపీ నాయకులు ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి జేబులు నింపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు స్పందించి అక్రమార్కుల చెర నుంచి చెట్లను రక్షించాలని, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, రైతులు కోరుతున్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం అనంతరం నిర్వహించిన స్పందనలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రకాల సమస్యలను విన్నవించారు. ఆయా సమస్యలపై స్పందించిన జేసీ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులు పదే పదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సాధ్యమైనంత వరకు ఆయా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఆయా శాఖల అధికారులు అర్జీల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు సమస్యలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఆర్. శ్రీలతతో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



శర్మాకాలేజి పూర్వ విద్యార్థులు

వేడుకగా శర్మాకాలేజీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి19 : సీఎస్ఆర్ శర్మాకాలేజి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 1988-91 బీఎస్సీ (బీజెడ్‌సీ) విద్యార్థులు ఏటా నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్‌లో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులైన వీరు ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. తాముచదువుకునే రోజులను గుర్తుచేసుకుని, వారి కుటుంబ యోగక్షేమాలు, పిల్లల భవిష్యత్ తదితర అంశాలపై చర్చించుకుంటూ ఆనందాలను పంచుకున్నారు. ఇకపై తమ బ్యాచ్ ఆధ్వర్యంలో వివిధ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగరీత్యా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసిస్తున్నప్పటికీ ప్రతి ఏటా ఇలా కలుసుకుని ఐక్యంగా ముందుకు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జి.చెన్నయ్య, నాయబ్ రసూల్, ఎస్.మోహన్‌రావు, ఆర్‌ఎన్ పద్మజ, మల్లేశ్వరి, సువర్ణ, సీహెచ్. పద్మజ పాల్గొన్నారు.

అధికారి ఇబ్బందులు పెడుతున్నారు

- వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఎరువుల వ్యాపారి ఫిర్యాదు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : సుదీర్ఘకాలంగా అన్ని రకాల లైసెన్సులు తీసుకొని ఎరువులు వ్యాపారం చేస్తున్నామని, తమపై కక్షసాధింపు చర్యలతో అనేక ఇబ్బందులు పెడుతున్నారని ప్రముఖ ఎరువుల వ్యాపారి దేసు వీరప్రకాశరావు ఫిర్యాదు చేశారు. సోమవారం అమరావతిలో వ్యవసాయశాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్‌ను కలిసి ఈమేరకు ఫిర్యాదు చేశారు. 67 ఏళ్ళ నుంచి వ్యాపార రంగంలో చట్టాలకు లోబడి వ్యాపారం చేస్తున్నామని, హోల్‌సెల్ డీలరులలో తాముటాప్-10లో ఉన్నామని తెలిపారు. 2009లో పక్క జిల్లాల నుంచి బదిలీపై ఒంగోలు వచ్చిన ఒక వ్యవసాయ అధికారి చార్జీ తీసుకున్న తర్వాత తమపై వేధింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అధికారి మరి కొంత మంది అధికారుల అండతో తమపై మూడు క్రిమినల్ కేసులు బనాయించి తమను, కుటుంబ సభ్యులను అరెస్టు చేసేందుకు అనేక సార్లు ప్రయత్నించడంతో హైకోర్టులో స్టే తెచ్చుకున్నామన్నారు. ఆ వ్యాపారానికి సంబంధించిన లైసెన్సును రద్దు చేయించడంతో హైకోర్టు నుంచి స్టే తెచ్చుకొని వ్యాపారం చేసుకొనేందుకు ప్రయత్నించగా ఆ అధికారి పరపతితో అన్ని కంపెనీలకు, అన్నిశాఖలకు, ఆఖరు బ్యాంకులకు కూడా తమపై చెడుగా చెప్పి వ్యాపారం జరగకుండా ఒక సీజన్ మొత్తం ఇబ్బందిపెట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమను ఇబ్బందులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేటి నుంచి పాలిసెట్ దరఖాస్తులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 19 : పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో వివిధ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహిస్తున్న పాలిసెట్-24 కు మంగళవారం నుంచి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు. ఏప్రిల్ 5వతేదీ వరకు దరఖాస్తులు చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తుఫీజు ఓసీ, బీసీలు రూ. 400, ఎస్సీఎస్టీలు రూ. 100 చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఏప్రిల్ 27న పాలిసెట్ పరీక్ష జరుగుతుంది. పదవ తరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు, 2024లో పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఆశక్తిగల అభ్యర్థులు స్థానిక డీఏ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. అజయ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ముఖ్య కార్యకర్తల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. జి. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన తరగతుల్లో సీఐటీయూ పనిపద్ధతులు- యూనియన్ల నిర్మాణం అనే అంశంపై అజయ్‌కుమార్ మాట్లాడారు. హిందూత్వ శక్తులు- ప్రతిఘటన పద్ధతులపై సీఐటీయూ జిల్లా మాజీ కార్యదర్శి వై. సిద్దయ్య, సంస్కరణలు- కార్మికులపై ప్రభావం అనే అంశంపై ఆసంఘం మాజీ ఉపాధ్యక్షుడు పూనాటి ఆంజనేయులు తరగతులు బోధించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్, జీవీకొండారెడ్డి, పి. కల్పన, మహేష్ తదితరులు ఉన్నారు.

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : జిల్లాలో వచ్చేనెలలో జరగనున్న పదవ తరగతి, ఓపెన్ స్కూల్స్ పదవ తరతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం విద్యాశాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు డీఈవో సుభద్ర మాట్లాడుతూ మార్చి 18నుంచి 30వతేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పద తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 602 పాఠశాలల నుంచి 29,449 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 1,479 మంది పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఓపెన్ స్కూలు పరీక్షలకు 1,660 మంది పదవతరగతి, 5,268 మంది ఇంటర్మీడియేట్ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇంటర్‌విద్యార్థుల కోసం 25, పదవ తరగతి విద్యార్థుల కోసం తొమ్మిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆయా అంశాలపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రానికి చేరిక, అనంతరం కేంద్రాలకు వీటిని చేర్చేంత వరకు కట్టుదిట్టమైన భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రశ్నపత్రాలను తరలించేందుకు 12 రూట్లపై పోలీస్ అధికారులకు స్పష్టమైన అవగాహన ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలలో ఎలాంటి కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్షలకు హాజరేయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు వైద్యాధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్‌ఐవో సైమన్ విక్టర్, ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావుతో పాటు రవాణా, విద్యుత్, పంచాయతీ, పోస్టల్, ట్రెజరీ శాఖల అధికారులు ఉన్నారు.

విధ్వంసపాలనకు చరమగీతం పాడాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ విజయ్‌కుమార్



చీమకుర్తి : నెహ్రూనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి,ఫిబ్రవరి19: రాష్ట్రంలో కొనసాగుతున్న విధ్వంసపాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమయిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని సోమవారం చీమకుర్తి పట్టణంలోని నెహ్రూనగర్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ హామీలైన సూపర్‌సిక్స్‌తో కూడిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలయిందన్నారు.ఏపీ సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే మళ్లీ సీఎంగా చంద్రబాబునాయుడును గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొల్లపూడి సుబ్బారావు, ఉన్నం సుబ్బారావు, కొండయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడ్లపల్లి రామబ్రహ్మం, ఆరుద్ర రామారావు, కాటేపల్లి యలమంద తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనపై చర్చకు సిద్ధం

సంతనూతలపాడు : రాష్ట్రంలో వైసీపీ అరాచక, విధ్వంస పాలనపై నేను సిద్ధం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధమా అంటూ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్ విజయ్‌కుమార్ సవాల్ విసిరారు. సంతనూతలపాడులోని స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎవరి పాలన స్వర్ణయుగమో, ఎవరిపాలన రాతియుగమో చర్చించే దమ్ముందా అంటూ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. జగన్‌కు 2019లో ప్రజలు ఇచ్చిన ఒక్కచాన్సే చివరి చాన్స్‌గా మిగలబోతుందన్నారు. ఓటమి భయంతో జగన్ ఇప్పటికే 77మంది ఎమ్మెల్యేలను మడతపెట్టాడని, మిగిలిన వైసీపీ ఎమ్మెల్యే ప్రజలు 50 రోజుల్లో మడతపెడతారన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన జగన్‌కు సామాజిక న్యాయం పలికే అర్హత లేదన్నారు. జగన్ పేరు చెబితే కోడికత్తిశ్రీను, బాబాయ్‌పై గొడ్డలి వేటు, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్‌ప్రోకో, ల్యాండ్, శాండ్, మద్యం మాఫియా గుర్తుకువస్తాయన్నారు. అలాగే సభ కవరేజ్‌కు వచ్చిన మీడియా వారిపై వైసీపీ రౌడీ మూకలు రాక్షసంగా ఎందుకు దాడిచేసారో చెప్పాలన్నారు. వచ్చే ఎన్నికలు పెత్తందారు జగన్‌కు, 5కోట్ల ఆంధ్రులకు జరిగే యుద్ధమన్నారు.

సంక్షేమం అంటే గుర్తొచ్చేది టీడీపీనే

రాష్ట్ర ప్రజలకు సంక్షేమం అంటే గుర్తొచ్చే ప్రభుత్వం టీడీపీ అని, అటువంటి ప్రభుత్వం తెచ్చిన 120 సంక్షేమ పథకాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని, మరికొద్దిరోజుల్లో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని రద్దు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

న్యాయవాది ఇంట్లో చోరీ

● రూ.15లక్షల నగదు అపహరణ

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ



చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి18: ప్రముఖన్యాయవాది నాగిశెట్టి మోహన్‌దాస్ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి రూ.15లక్షలు నగదు అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటన స్థానిక దేవుడుచెరువులో మోహన్‌దాస్ ఇంట్లో ఆదివారం రాత్రి జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి మోహన్‌దాస్ దంపతులు నెల్లూరు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి తలుపు తాళం తీసిచూడగా బీరువాలో ఉన్న దుస్తులు చెల్లాచెదురుగా పడవేసి ఉన్నాయి. ఇంటి వెనుక వైపుఉన్న తలుపు గడి పెకళించి దొంగలు లోపలికి చొరబడ్డారు. బెడ్ రూంలో తలుపు కూడా పెకిలించి లోపలికి వెళ్లి బీరువాను ఇనుపరాడ్‌తో పెకలించారు. అందులోఉన్న రూ. 15 లక్షల నగదును అపహరించుకు వెళ్ళారు. ఈమేరకు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ కిషోర్‌బాబు, సీఐ లక్ష్మణ్, సిబ్బంది వచ్చి పరిశీలించి కేసు నమోదుచేశారు. సంఘటనా స్థలంలో పోలీసులు కీలకమైన ఆధారాలు సేకరించారు. అంతే కాకుండా డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన చేయించారు.

అసమ్మతి గ్రూపు నేతలకు మంత్రి బుజ్జగింపులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి19 : మండల వైసీపీలోని అసమ్మతి గ్రూపు నేతలతో సోమవారం ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున మద్దిరాలపాడు వైసీపీ కార్యాలయంలో సమావేశమై వారిని బుజ్జగించారు. కార్యకర్తలకు, నాయకులుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లులు వచ్చేవిధంగా కృషి చేస్తానని,ఎం ముప్పాళ్ల , ఈదుమూడి ,ఒమ్మెవరం గ్రామాల పంచాయతీ కార్యదర్శిని బదిలీచేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. వెలుగు ఏపీఎంను తిరిగి నాగులుప్పలపాడుకు బదిలీ చేయిస్తానంటూ అసమ్మతి నేతల డిమాండ్లకు తలొగ్గి హామీలిచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, ఏఎంసీ మద్దిపాడు ఛైర్మన్ మారెళ్ల బంగారుబాబు, నాయకులు ఇనగంటి పిచ్చిరెడ్డి, వైకుంట వీరాంజనేయులు, కూనం పూర్ణ చంద్రరావు, పులిచర్ల పరంధామరెడ్డి, కొమ్మూరి సుధాకర్, బత్తుల ప్రసన్న, కరణం రమేష్, మాదాసు రాంబాబు, ఉప్పగుండూరు శ్రీనివాసప్రసాదు, కోమట్ల త్రినాథ్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసీపీలోని అసమ్మతి గ్రూపునేతలతో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

రేపు మాతృభాషా దినోత్సవం

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 19: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా బుధవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని సంఘ కార్యాలయంలో నిర్వహించే వేడుకలలో మిడసల మల్లిఖార్జునరావు, కోవెలకుంట్ల బాలకోటయ్య, కృష్ణవేణి పరాంకుశంలకు సన్మానం, కవిసమ్మేళనం వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. కనుక కవులు, కళాకారులు, సాహిత్య సంస్థల ప్రతినిధులు, సాహిత్యాభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండన

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని నాగులుప్పలపాడు మండల రిపోర్టర్‌లు తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వైసీపీ రౌడీ మూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో మండలరిపోర్టర్‌లు యు .రాజశేఖర్, ఎన్. బాలాంజనేయులు ,కె . డానియేల్, కె.విజయ్, సురేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

పోలీసు స్పందనకు 86 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ శ్రీధరరావు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి18: పోలీసు స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 86 మంది తమ వినతులను అందజేశారు. సోమవారం స్థానిక పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందనలో అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎం.కిషోర్‌బాబు, వి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు క్యూరింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : రైతులు పొగాకు క్యూరింగ్ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ఎం. లక్ష్మణరావు సోమవారం సూచించారు. బ్యారన్‌కు సరిపడా 800 నుంచి వెయ్యి లోపు కర్రలను మాత్రమే అమర్చాలని, క్యూరింగ్ జరిగే ముందు బ్యారన్ స్థితిని పొగాకు రైతులు గమనించాలన్నారు. సరైన సమయంలో ఆకులను రేల్చుకున్నట్లయితే ఆకులు ఎక్కువ పండకుండా అరికట్టవచ్చని, రెల్చిన ఆకులపై ఉన్న తేమను ఆరనివ్వాలన్నారు. ఆకును బ్యారన్‌లో ఎక్కించిన తర్వాత సరిపడా గాలిని ఇవ్వడం ద్వారా బ్యారన్ రాటట్ రాకుండా చేసుకోవాలని సూచించారు యల్లోయింగ్, రంగు నిలుచు దశలలో ఉష్ణోగ్రత తగిన విధంగా ఉండాలని, కాడ ఆరే దశలో బ్యారన్ లోపల ఉష్ణోగ్రత వెంటనే పడిపోకుండా చూసుకోవాలని, కాడ ఆరే దశ పూర్తయిన తర్వాత గాలి చొరబడేందుకు వీలుగా అన్ని కిటికీలను తెరిచి ఉండాలని తెలిపారు. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బ్యారన్‌లో జరిగే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని లక్ష్మణరావు తెలిపారు.



శివాజీకి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

ఛత్రపతి శివాజీ జయంతి

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 19:మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం ఆరె మరాఠ, ఆరె క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షులు కాళే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక మరాఠీపాలెంలోని ఛత్రపతి శివాజీ విగ్రహానికి సంఘ నాయకులు, మరాఠా కుటుంబీకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దయిండే ప్రభాకర రావు, జాజం తిరుమలరావు, సోమాసి శివప్రసాద్, కాళే సుబ్బారావు, అంబూరి రాఘవరావు, సోమాసి శంకరరావు, కాళే కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను విడుదల చేయాలని నేడు ధర్నా

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఏపీజేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు వై. శ్రీనివాసులు, కేవీజీ కీర్తి, ఎ. అంకయ్య, బి. అశోక్‌కుమార్, ఐఫియా నాయకులు వీవీ సుబ్బారావులు ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు.

మెగా డీఎస్సీ పేరుతో మోసం

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పువ్వాడి దామోదర్ ఒక ప్రకటనలో విమర్శించారు. మాట తప్పను, మడమ తిప్పను అంటూ చెప్పి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 30వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6,100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులను దగా చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న వసతి దీవెన, విద్యాదీవెన డబ్బులను అకౌంట్లలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అవీ..ఇవీ..

సెపక్ తక్రా బాల, బాలికల జట్లు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జట్లు

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 19 : సెపక్‌తక్రా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల, బాలికల జట్ల ఎంపిక జరిగింది. స్థానిక మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ ఎంపిక పోటీలకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహించగా, ప్రతిభ కలిగిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైనజట్లు ఈనెల 24, 25 తేదీలలో నెల్లూరు జిల్లా ముత్తుకూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అధ్యక్షులు వెంకటరెడ్డి, సెక్రటరీ రవి ప్రసాద్, కోచ్ బి. శ్రీనివాసులు తెలిపారు.

బడుగులకు జనసేన అండ



19 వ డివిజన్‌లో జనచైతన్య యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారంలో కార్యకర్తలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : బడుగు, బలహీనవర్గాల ప్రజలకు జనసేన పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. జనచైతన్య యాత్రలో భాగంగా సోమవారం 19వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అన్ని రకాల ధరలు పెరగడంతో పాటు సామాన్యులు బతకాలంటేనే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల వచ్చే ఎన్నికల్లో జనసేనపార్టీ బలపర్చే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు తేళ్ళ హరీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముత్యాల కల్యాణ్, బొందిల శ్రీదేవి, ఉంగరాల వాసు, మర్రిపూడి ఉదయ్, నరసింహారావు, నరేష్, అనూష, మాధవి, శనగల కిరణ్‌నాయుడు, సాయి కృష్ణ తదితరులు ఉన్నారు.

సెయింట్ థెరిస్సా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 19: నగరంలోని సెయింట్ థెరిస్సా విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. 2001-2002 సంవత్సరం బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు కుటుంబ సమేతంగా పాల్గొని సంతోషంగా గడిపారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, వారు చదివిన తరగతి గదిలో ముచ్చట్లు చెప్పుకుని మురిసిపోయారు. అనంతరం తమకు విద్యా బుద్ధుల నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉండాలని, అన్నింటా అభివృద్ధి సాధించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నిర్వాహకులు షరీఫ్, రాజు, డానీ, సుకుమార్, బాలాజి, ప్రసాద్, రేష్మ, మున్నీ, జ్యోతి, సబీనా తదితరులు పాల్గొన్నారు.

రైలులో అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



రైలులో పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి18: రైలులో అక్రమంగా తరలిస్తున్న మిలటరీ మద్యం ను సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ఒంగోలు రైల్వే సీఐ ఎన్.శరత్ బాబు తెలిపారు.ఉత్తర ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఆర్మీలో పని చేసే పయావుల రాంబాబు తన బావమర్ది మక్కే సురేష్ ద్వారా 83 ఫుల్‌బాటిళ్ళ మద్యం గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వద్దఫూరు కు అక్రమంగా తరలిస్తుండగా రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో మక్కే సురేష్ మద్యం తరలిస్తుండగా రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి పట్టుకున్నారు. ఈమేరకు సురేష్ పై కేసు నమోదుచేసి అరెస్టు చేశామని తెలిపారు.

విద్యుదాఘాతంతో మార్బుల్ కార్మికుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి, ఫిబ్రవరి19: గృహనిర్మాణ పనుల్లో భాగంగా మార్బుల్ వర్క్ చేస్తూ విద్యుదాఘాతానికి గురైై కార్మికుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వస్తే శ్రీకాకుళం జిల్లాకు చెందిన కె.రామారావు(38) గత కొంతకాలంగా ఒంగోలులో నివసిస్తూ మార్బుల్ వర్క్ చేస్తున్నాడు. చీమకుర్తి మండలం తొర్రగుడిపాడులో శ్రీనివాసరావుకు చెందిన గృహంలో సోమవారం పనిచేస్తుండగా విద్యుత్‌షాక్‌నకు గురయ్యాడు. వెంటనే అతన్ని వైద్యసేవలు నిమిత్తం చీమకుర్తి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. సీఐ దుర్గాప్రసాద్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు.కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.



కాలికి గాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

కూలిన మరుగుదొడ్డి గోడ బాలికకు గాయాలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి19: నాగులుప్పలపాడు ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్డి గోడకూలటంతో సోమవారం ఓ బాలికకు తీవ్ర గాయమైంది. ఇస్తర్ల లిఖిత అనే బాలిక రెండవతరగతి చదువుతున్నది. పాఠశాల ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో మరుగుదొడ్డి గోడ కూలింది. దీంతో బాలిక కాలికి తీవ్ర గాయమైంది. ఉపాధ్యాయులు బాలికను ప్రాథమిక పాఠశాలకు తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు.

హోంగార్డుకు ఎస్ఐ వితరణ



ఆర్థిక సహాయం అందిస్తున్న ఎస్ఐ

చీమకుర్తి,ఫిబ్రవరి19: చీమకుర్తి పోలిస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యానికి గురైన మహిళా హోంగార్డు దుడ్డు కుమారికి బల్లికురవ ఎస్ఐగా పనిచేస్తున్న నాగశివారెడ్డి సాయం అందించారు. సోమవారం కుమారిని కలిసి పరామర్శించి రూ.50వేల నగదును ఆర్థికసాయంగా అందించారు. నాగశివారెడ్డి గతంలో చీమకుర్తి ఎస్ఐగా పనిచేసినపుడు కుమారి ఇదే స్టేషన్‌లో పనిచేశారు.

ముసలయ్యకు బీఎన్ నివాళి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 19: టీడీపీ కార్యకర్త మార్పుడి జనార్దన్ తండ్రి మార్పుడి ముసలయ్య ఆదివారం రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. సోమవారం ముసలయ్య భౌతికకాయాన్ని బీఎన్ విజయ్‌కుమార్ సందర్శించి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకాస్వాములు, మండల టీడీపీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు ఆర్.అంకారావు, టి.శ్రీను, ఎం.శ్రీను, గోపి, ఆంజనేయులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న బీఎన్, ఇతర టీడీపీ నేతలు

గురుకుల పాఠశాలలో సెల్ఫీ విత్ బీఎన్



గురుకుల పాఠశాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న విజయ్‌కుమార్

సంతనూతలపాడు, ఫిబ్రవరి19: సంతనూతలపాడులోని స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ సెల్ఫీ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.13కోట్లతో 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వ హయంలో స్థల దాతలతో మాట్లాడి గురుకుల పాఠశాల నూతన భవనానికి ఏర్పాట్లు చేయించానన్నారు. తదనంతరం అంతవేగంగా భవనం నిర్మాణం పూర్తైందన్నారు. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ హయంలో నిర్మించి చెప్పుకోదగ్గవి ఏమైన ఉన్నాయా అని ప్రశ్నించారు. నాడు గురుకుల పాఠశాల నూతన భవన ఏర్పాట్లుకోసం నాటి ముఖ్యమంత్రి చంద్రబాబును నిధులకోసం అభ్యర్థించగా విద్యార్థుల భవిష్యత్తు కంటే ఎక్కువేమి కాదని యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేయించారని బీఎన్ తెలిపారు. అటువంటి ముఖ్యమంత్రి వస్తే రాష్ట్రభవిష్యత్తు బాగుంటుందన్నారు.

సాగని విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం

అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శంకుస్థాపన

నాలుగేళ్లుగా అడుగుపడని పనులు

అమలుకాని ఎమ్మెల్యే మద్దిశెట్టి హామీ

రైతులకు తప్పని లోవోల్టేజీ సమస్య


విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణం కోసం తీసిన పునాది గుంతలు

తాళ్లూరు, ఫిబ్రవరి 19 : వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగమేఘాలపై 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుపై చేసిన ప్రకటనకు నాలుగేళ్ల యింది. దాని నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయంటూ పనులకు అప్పటి ఆ శాఖ మంత్రి, ఎం పీ మాగుంట, ఎమ్మెల్యే మద్దిశెట్టి శిలాఫలకాన్ని ఏర్పా టు చేశారు. నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పనులు ప్రా రంభం కాలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి 60 గ్రామాలకు చెందిన వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సాక్ష్యాత్తూ అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనవరి 2020లో రూ.22.7కోట్ల ని ధులతో 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లు పూర్తయినా ఒక్క అ డుగు కూడా పడలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన గ్రామాల్లో భూగర్భ జలాలు అధికంగా ఉండడంతో రైతాంగం వ్యవసాయ బోర్లపై ఆధారపడి వ్యవసాయ పంపు సెట్ల మోటార్ల ద్వారా పంట సాగు చే స్తున్నారు. దీంతో విద్యుత్ వాడకం అధికంగా ఉండడంతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా అధికంగా ఈ మండలంలో 10 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చే శారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తాళ్లూరు పరిసరగ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు శ్రద్ధ కనపరిచి శివరాంపురం గ్రామ శివారు తూర్పుగంగవరం - చీమకుర్తి వెళ్లే మార్గంలో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి విద్యుత్ శాఖకు అప్పగించారు. అప్పటి మంత్రి బాలినేని రైతులపై ప్రే మతో వ్యవసాయ విద్యుత్‌కు సహకారం అందిస్తూ త క్షణమే నిధులు మంజూరు చేస్తూ అట్టహాసంగా శం కుస్థాపన కూడా చేశారు. విద్యుత్ ఉప కేంద్రం నిర్మా ణ ప్రాంతంలో లక్షలు వెచ్చించి మట్టిని తోలి చదును కూడా చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చి మొ క్కలతో దర్శనమిస్తోంది. శంకుస్థాపన చేసిన ఏడాదికి కాంట్రాక్టర్ మెటీరియల్‌ను, సామగ్రిని తోలారు. ఆ మెటీరియల్ చోరీకి గురైంది. దీంతో మిగతా సామగ్రి కోసం జీతం ఇచ్చి కాపలాదారుడిని నియమించారు. ప్రస్తుతం అతడికి జీతం చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉప కేంద్ర నిర్మాణం ఎప్పుడు చేస్తా రో తమ సమస్యలు ఎప్పుడు తొలిగిపోతాయోనని రై తులు ఎదురుచూస్తున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుండగా విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణం కలగానే మిగులుతుందని ప్రజలు, రైతులు పెదవివిరుస్తున్నారు.

చేనుకు చీరల కంచె



పామూరు, ఫిబ్రవరి 19 : ఆరుగాలం కష్టపడి పండించిన పం టలను అడవి పందుల నుంచి కాపాడుకోవడం రైతులకు కష్టంగా మా రుతోంది. కంచెను సైతం పడేసి అడవి పందులు పంటను నాశనం చే స్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు పగలంతా పొలాల వద్ద కాప లాకాస్తున్న రైతులు రాత్రి వేళ అడవి పందులు రాకుండా ఉండేందుకు కొత్తకొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అడవి పందులు పొలాలకు రాకుండా చుట్టూ చీరలను కంచెల వలె కడుతున్నారు. రంగురంగుల పాత చీరలతో పొలాలకు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాత్రిపూట వచ్చే పందులు రంగురంగుల చీరలను చూసి, హోరు గాలి శబ్దానికి పొలాల వద్దకు రావడం లేదని రైతులు చెప్తున్నారు.

స్వాతికి శిక్షా రతన్ అవార్డ్

కురిచేడు, ఫిబ్రవరి 19 : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి వారికి విద్యలో నైపుణ్యాలను వెలికి తీసే ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఇచ్చే శిక్షా రతన్ అవార్డు 2023-24లో కురిచేడు మండలం బోదనంపాడు ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వల్లెం స్వాతికి దక్కింది. స్వాతి విద్యార్థులకు సీబీఎస్ఈ పద్ధతిలో సులభమైన రీతిలో పాఠ్యాంశాలకు బోధిస్తారనే పేరు ఉంది. ఆమెకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషకరమని ఉపాధ్యాయులు అభినందించారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయం

నిరసన తెలిపిన జర్నలిస్టులు



ఎస్సై శ్రీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జగన్ నిర్వహించిన సిద్ధం సభను కవర్ చేసేందుకు వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు పాశవికంగా దాడిచేయడం హేయమని ఏపీయూడబ్ల్యూజే కొండపి ప్రాంతీయ కమిటీ సభ్యులు అన్నారు. నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం ఎస్సై టి.శ్రీరామ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదురు ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సాక్షాత్తూ సీఎం సభలో జర్నలిస్ట్‌పై దాడి జరిగితే ప్రభుత్వం తరపున ఒక్కరు కూడా ఖండించకపోవడం దారుణమన్నారు. ఈఘటనతో వైసీపీ నేతలకు జర్నలిస్ట్‌లపై ఉన్న గౌరవం ఏపాటితో మరోసారి తేటతెల్లమైందన్నారు. జర్నలిస్ట్‌లపై దాడులు ఇలాగే కొనసాగిస్తే రాబోయే ఎన్నికల్లో వైసీపీ తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే కొండపి ప్రాంతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు కసుకుర్తి రామలింగం, అధ్యక్షుడు పల్నాటి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు కాకర్ల నరసింహారావు, జర్నలిస్ట్‌లు ఎస్కే. బాషు, కోటేశ్వరరావు, చెంగలరావు, సుబ్రమణ్యం, రామ్మోహన్, మహేష్, రవి, శ్రీహరి, దాసు, సురేష్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

కొండపి/పొన్నలూరు : రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు కొండపి సీఐ పాండురంగారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చాగంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, మామిళ్లపల్లి మల్లికార్జున, పూర్ణచంద్రరావు, సూర్య, కిరణ్, వేణు పాల్గొన్నారు. పొన్నలూరులో ఎస్సై ఎం.వి.రాజేష్‌కు జర్నలిస్ట్‌లు వినతిపత్రం అందజేశారు. వారిలో చప్పిడి నరసింహం, పాలడుగు రజనీకాంత్, పల్లపోతు మాల్యాద్రి, గడ్డం మనోహర్, అజయ్‌కుమార్, రత్తయ్య, హస్సాన్, నేలపాటి బ్రహ్మయ్య చౌదరి ఉన్నారు.

ఆంధ్రజ్యోతిఫోటో గ్రాఫర్‌పై దాడి అమానుషం

మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు నిరసన

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 19 : అనంతపురం జిల్లా రాప్తాడులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభకు కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ పై దాడిని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఖండిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ నాయకులు అమానుషంగా దాడి చేయడం దారుణమన్నారు. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణారహితంగా కొట్టిన వైసీపీ రౌడీ మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడికి నిరసనగా మంగళవారం ఒంగోలులోని ప్రకాశం భవనం ఎదుట పలు ప్రజా సంఘాలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సోదరులు, వీడియో జర్నలిస్టులు, మీడియా ఫొటోగ్రాఫర్లు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

రహదారి భద్రత నియమాలు పాటించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి18: రహదారి భద్రత నియమాలను పాటించి ప్రమాదాలు నివారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాలు ముగింపు సమావేశం జరిగింది. కార్యక్రమానికి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్ళగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయిని తెలిపారు. అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,హెల్మెట్ లేకుండా చోదన చేయకూడదని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు వాడాలని చెప్పారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ గత నెల 20 నుంచి ఈనెల 19 వరకు రహదారి మాసోత్సవాలు నిర్వహించి అనేక కళాశాలలో రహదారి భద్రత పై అవగాహన సదస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు , రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవన్ నాయక్, అర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, నేషనల్ హైవే మేనేజర్ ఆనందసింగ్, మార్కాపురం ఆర్‌టీవో అమర్‌నాయక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ ప్రభాకర్, జగదీష్, రవికుమార్, సురేంద్ర ప్రసాద్ , రామచంద్రరావు, మాధవరావు, జగదీష్, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, డ్రైవర్లతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

బ్రాహ్మణులకు అండగా ఉంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు (కల్చరల్),ఫిబ్రవరి 19:తనకు చిన్నతనం నుంచి బ్రాహ్మణులంటే ఎంతో గౌరవమని, వారికి ఎప్పుడూ అండగా ఉంటానని ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం ఆయన బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నుంచి మంగమూరు జంక్షన్ వరకు ఉన్న రోడ్డుకు టంగుటూరి ప్రకాశం పంతులు రోడ్డుగా నామకరణం చేస్తూ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ఎదురుగా మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు విగ్రహ ఏర్పాటుకు బాలినేని శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఇటీవల నగరపాలక సంస్థ బ్రాహ్మణ సేవాసమితికి కేటాయించిన స్థలంలో నిర్మించ తలపెట్టిన బ్రాహ్మణ ఆబ్దిక భవనానికి బాలినేని శ్రీనివాస రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్లు నీలంరాజు సరోజ, ఆదిపూడి గిరిజా శాండిల్య, బ్రాహ్మణ సేవాసమితి నాయకులు గంజాం రంగనాథ్, నేలబొట్ల సదాశివ శాస్త్రి, చీమలమర్రి వెంకట సుబ్బారావు, డాక్టర్ గంజాం శ్రీనివాస మూర్తి, సముద్రాల భీమశంకర శాస్త్రి, ఉప్పుగుండూరి శ్రీనివాస రావు, ములుకుట్ల శ్రీరామచంద్ర మూర్తి, మైనంపాటి సాయికుమార్, గడియారం సుబ్బయ్య శర్మ పాల్గొన్నారు.

వైసీపీలో వర్గపోరు

పనులు పూర్తి చేయకుండానే సచివాలయం ప్రారంభం

బిల్లు ఇవ్వకుండా ప్రారంభించారని కాంట్రాక్టర్ ఆవేదన

ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపణ


వల్లాపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

బల్లికురవ, ఫిబ్రవరి 19 : మండలంలోని వల్లాపల్లి వైసీపీలో వర్గపోరు బహిర్గతమైంది. గ్రామంలో వైసీపీకి చెందిన నాయకుడు మందా వీరాంజనేయులు గ్రామ సచివాలయ భవన పనులు చేస్తున్నారు. ఇంకా కొంత పనులు చేయాల్సి ఉంది. ఇందుకుగాను ఫైనల్ బిల్లు రూ.5.70 లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఇవేమి పట్టించుకోకుండా వల్లాపల్లి గ్రామంలోని వైసీపీలోని రెండో వర్గం నేతలు నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనానికి వేసి ఉన్న తాళాన్ని అధికారుల ద్వారా పగులగొట్టించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డితో సోమవారం రాత్రి ప్రారంభించే చర్యలు చేపట్టారు. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తనకు తెలియకుండా.. తనకు చెల్లించాల్సిన బిల్లులు రాకుండా ఎలా ప్రారంభిస్తారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ అధికారులు ఇవేమి పట్టించుకోకుండా తనకు బిల్లులు ఇవ్వకుండా తన పేరు శిలాఫలకంపై వేయకుండా భవనం కింది భాగంలో శిలాఫలకం వేసి ప్రారంభించారని కాంట్రాక్టర్ వాపోయాడు. తాను వైసీపీలో ఉన్నా ఇలా చేశారని, ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. ఎస్సీ అని చిన్నచూపు చూశారని, తాను కోర్టుకు వెళతానని చెప్పారు. పనులు పూర్తి చేయకుండా పంచాయతీ కార్యదర్శికి భవనం ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. వల్లాపల్లిలో వైసీపీలో ఉన్న రెండు వర్గాల మధ్య సచివాలయ భవన ప్రారంభం వద్ద గొడవలు జరిగే అవకాశం ఉందని గమనించిన ఎస్ఐ శివనాగిరెడ్డి సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే స్వామి

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 30 కుటుంబాలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో వైసీపీని వీడి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. పాకల పంచాయతీ పరిధి పోతయ్యగారిపాలెంలో వైసీపీకు చెందిన 20 కుటుంబాలు, సోమరాజుపల్లెకు చెందిన 10 కుటుంబాల వారు ఆపార్టీని వీడి ఆదివారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో తట్టెడు మట్టికూడా పోయలేదని విమర్శించారు. వైసీపీ నాయకులకు దోచుకోవడంపై ఉన్న యావ అభివృద్ధిపై లేదని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వం రాగానే గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. బీసీ వర్గానికి చెందిన వారు పార్టీలోకి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో వాయిల చిరంజీవి, ప్రభాకర్, కటారి భార్గవ్, అరవింద్, కొడూరి నాగరాజు, రామాంజనేయులు, చెంచంగారి చిట్టిబాబు, గణేష్, కుర్రు గోపి, వసంతకుమార్, రవితేజ, వాయిల అశోక్, నర్రా రామకోటయ్య, వేల్పుల రవికుమార్, ప్రసాద్, సురేష్, పలు కుటుంబాలు వారు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చీమకుర్తి కృష్ణ, మందలపు గాంధీచౌదరి, పొనుగోటి కొండయ్య, ఇమ్మిడిశెట్టి రామారావు, సిద్ధయ్య, ముత్యాలు, యానాది, జమ్ము శంకర్ పాల్గొన్నారు.

దళితవాడల్లో మౌలిక వసతులు కల్పిస్తాం


సూరారెడ్డిపాలెంలో పర్యటిస్తున మంత్రి సురేష్

టంగుటూరు, ఫిబ్రవరి 19 : దళితవాడల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెం దళితవాడలో సోమవారం రాత్రి పల్లెపల్లెకు సురేష్ అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు తక్కెళ్లపాటి సుధాకర్, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సింగరాయకొండ : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నియోజకవర్గంలో 34 మందికి మంజూరైన చెక్కులను సోమవారం మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆపార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, రాపూరి ప్రభావతి, నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 19: వరికోత యంత్రం, లారీ పక్కపక్కనే ఢీ కొనటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ వైపు వెళ్తున్న వరికోత యం త్రం సోమవారం రాత్రి అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగు వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి లారీ క్రాస్ చేసే సమయంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా, వరికకోత యంత్రంపై ఉన్న విజయకుమార్, నౌషాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వెంకటేష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

జంకెను అభినందించిన బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : ఏపీఐఐసీ చైర్మన్‌గా చైర్మన్‌గా వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని కార్యాలయంలో సోమవారం జంకే బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలను స్వీకరించిన జంకె వెంకటరెడ్డిని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బొకే ఇచ్చి అభినందించారు. ఈసందర్భంగా జంకె మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. జంకె వెంకటరెడ్డిని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్ తదితరులు అభినందించారు.

బాలుడు మృతి బాధాకరం

పర్చూరు, ఫిబ్రవరి 19: పర్చూరు ఇందిరా కాలనీలో షేక్ మౌలాలి(అడితి) కుమారుడు (14) మృతి చెందటంతో సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు. బాలుడు మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు వెంకటకృష్ణారావు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

- రాత్రి సమయాల్లో తగ్గిన పోలీసుల గస్తీ

- అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్


దొంగలు చిందరవందరగా పడవేసిన దుస్తులు, వస్తువులు

అద్దంకి, ఫిబ్రవరి 19 : తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో అద్దంకి పట్టణంతో పాటు మండల పరిధిలో జరిగిన చోరీలను పరిశీలిస్తే అన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. గత రెండు, మూడు నెలల వ్యవధిలోనే సుమారు పది ఇళ్లలో చోరీలు చోటుచేసుకున్నాయి. మూడు నెలల క్రితం అద్దంకి పట్టణంలోని సాయినగర్(కమలేశ్వరస్వామి మాన్యం)లో రెండు ఇళ్లలో, నెల రోజుల క్రితం విశ్వభారతి స్కూల్ రోడ్డులోని టవర్ సమీపంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆదివారం రాత్రి అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో భారీ చోరీ జరిగింది. మండలంలోని శ్రీనివాసనగర్‌లో నెల రోజుల క్రితం రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. పది రోజుల క్రితం గోపాలపురంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది. ఇలా పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరిగాయి. నేరుగా తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి బీరువాలు తెరిచి చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో అత్యధిక శాతం చోరీలు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే శివారు గృహాలు కావటంతో పాటు నామ్ రోడ్డుకు సమీప ప్రాంతాలు కావటం విశేషం. దీనిని బట్టీ చోరీలకు పాల్పడిన తరువాత సులువుగా తప్పించుకొని వెళ్లేందుకు వీలుగా ముందుగా రెక్కీలు నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతుంది.

అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉండేవిధంగా లాక్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) ఏర్పాటుచేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ జరిగేది. గతంలో ఈ పద్ధతి ద్వారా కొంతమేర సత్ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు పూర్తిగా అటకెక్కింది. రాత్రి సమయాలలో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో నామ్ హైవేపై గతంలో గస్తీకి అద్దంకి నియోజకవర్గ పరిధిలో రెండు పోలీస్ మొబైల్ వాహనాలు ఉండేవి. ప్రస్తుతం ఒకదానినే పరిమితం చేయటంతో పాటు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడి తప్పించుకునేందుకు వీలుగా మారటంతో చోరీలు అధికమయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చోరీలు జరగకుండా మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తికాని సచివాలయాలు


రాచర్లలో మధ్యలోనే నిలిచిన సచివాలయం

- నిధులు మంజూరు కాకపోవడంతో ఆగిపోయిన నిర్మాణాలు
- పశువులకు ఆవాసంగా మారుతున్న వైనం

రాచర్ల, ఫిబ్రవరి 19 : సచివాలయాలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని, వాటి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవరూపం అందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ఐదేళ్లు కావస్తున్నా, నేటికీ పలు సచివాలయాలు పూర్తి కాలేదు. దీంతో మండలంలోని 14 పంచాయతీల పరిధిలో సచివాలయ నిర్మాణం పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. కేవలం ఆరవీటికోట, గుడిమెట్ట గ్రామాలలో మాత్రమే సచివాలయాలు పూర్తయ్యాయి. మిగిలిన 13 పంచాయతీలలో సచివాలయాలు వివిధ దశల్లో ఉన్నాయి. మండల కేంద్రమైన రాచర్లలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో సచివాలయ భవనం పూర్తయినప్పటికీ ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదు. కాలువపల్లి, యడవల్లి పంచాయతీలలో సచివాలయ భవన నిర్మాణాలకు రూ.25లక్షలు మంజూరు కాగా పంచాయతీ కార్యాలయంపైనే నిర్మించి అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగిలిన పంచాయతీల్లో ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో సర్పంచులు సచివాలయ నిర్మాణాలను మధ్యలోనే వదిలివేశారు. సత్యవోలు సచివాలయం నిర్మాణం 50శాతం మాత్రమే పూర్తయింది. కాంట్రాక్టర్ నిధులు రాకపోవడంతో వదిలేశాడు. ఆ సచివాలయంలో గ్రామస్థులు పశువులను కట్టివేస్తున్నారు. ఆకవీడు, జే.పీ.చెరువు చోళ్లవీడు, అనంపల్లి, సోమిదేవిపల్లి, చినగానిపల్లి గ్రామాలలో సచివాలయాల నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. అనంపల్లి సచివాలయ నిర్మాణం బాధ్యత ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు తీసుకున్నాడు. ఖర్చు భరించలేక మధ్యలోనే వదిలివేశాడు. దీంతో ఆ సర్పంచ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 80శాతం పనులు పూర్తి చేశాడు. నిధులు రాకపోవడంతో 20శాతం పనులు ఆగిపోయాయి. చినగానిపల్లె పంచాయతీలో ప్రైవేటు భవనంలో సచివాలయం ఉండగా ప్రతినెలా అద్దె చెల్లించకపోవడంతో యజమాని తాళం వేశాడు. పాలకవీడు పంచాయతీలో సచివాలయ నిర్మాణం జరుగాల్సి ఉండగా గ్రామాల పోరు కింద కోర్టు వరకు పోయింది. ఐదేళ్ళు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో వైసీపీ సర్పంచ్‌లు పూర్తిగా నష్టపోయామని బహిరంగంగానే చెబుతున్నారు. 10 చోట్ల అద్దె భవనాల్లోనే సచివాలయాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు వస్తుండడంతో పెట్టుబడులు పెట్టిన వాటికి బిల్లులు వస్తాయో, రావోనని సర్పంచ్‌లు ఎదురు చూస్తున్నారు.

త్వరలోనే పూర్తి చేస్తాం

మండలంలో సచివాలయ నిర్మాణాలు పూర్తస్థాయిలో కాలేదన్నది వాస్తవమేనని, ఇప్పటికి కేవలం రెండు సచివాలయాలు మాత్రమే పూర్తయ్యాయని, మిగతా సచివాలయాలు వివిధ దశల్లో ఉన్నాయని, నిధులు మంజూరు కాకపోవడంతో నిర్మాణాలు చేపట్టడానికి ముందుకు రావడం లేదని, త్వరలో సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ జెఇ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శ్రీనివాసరెడ్డి, జేఈ పంచాయతీరాజ్

ఏబీఎం ఆస్తులను కాపాడండి

సబ్‌కలెక్టర్‌కు బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్, పాస్టర్ల వినతి


వినతిపత్రం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఏబీఎం ఆస్తులను కాపాడాలని కోరుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద మార్కాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు దేవదానం మాట్లాడుతూ పట్టణంలోని ఓ ప్రముఖ వ్యక్తి ఏబీఎం ఆస్తులను దౌర్జన్యంగా ఆక్రమించారన్నారు. వాటిని కాపాడాలని కోరారు. ఆక్రమణదారులు కట్టిన కట్టడాలను కూల్చివేయాలని హైకోర్టు ఏడాది క్రితం నోటీసులు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ, అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అమెరికన్ బాప్టిస్ట్ మిషనరీస్ సంస్థ ఆ స్థలాన్ని అణగారిన వర్గాల ప్రజల విద్య, వైద్యం కోసం కేటాయించిందన్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ధనబలంతో దౌర్జన్యంగా స్థలాన్ని ఆక్రమించారని వారి నుంచి ఆ స్థలాన్ని తిరిగి ఏబీఎం కు అప్పజెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కమిటీ సభ్యులు ఆరు మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

దళితులను మోసగించిన వైసీపీ

- టీడీపీ ఇన్‌చార్జ్ నారాయణరెడ్డి విమర్శ
- పార్టీ కండువ కప్పుకున్న ఎస్సీలు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19: గత ఎన్నికల సమయంలో వైసీపీ అబద్ధపు హామీలు ఇచ్చి దళితులను మోసం చేసిందని టీడీపీ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బోడపాడు గ్రామంలోని ఎస్సీ పాలెంలో మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సమక్షంలో 50 వైసీపీ కుటుంబాలు సోమవారం రాత్రి టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వైసీపీకి ఓటు వేసి తప్పు చేశామన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కందుల నారాయణరెడ్డితోనే ఎస్సీల అభివృద్ధి సాధ్యమని నమ్మి పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ.. రానున్న టీడీపీ ప్రభుత్వం హయాంలో మార్కాపురం ప్రత్యేక జిల్లా ఏర్పాటు సాధ్యమన్నారు. తద్వారా చుట్టు పక్కల గ్రామాల ఎంతో అభివృద్ధి చెందుతాయన్నారు. టీడీపీ అమలుజేయనున్న సూపర్ సిక్స్ పథకాల వలన ముఖ్యంగా మహిళలు చాలా లబ్ధి పొందుతారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ బోడపాడు గ్రామ అధ్యక్షుడు బొగ్గు శేఖర్‌రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన దళితులు

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

మార్కాపురం వన్‌టౌన్ : అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తోందని, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక 34వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి తిరిగి యోగక్షేమాలు తెలుసుకున్నారు. రానున్న టీడీపీ-జనసేన హయాంలో అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కందుల నారాయణమ్మ, తెలుగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాగింగ్ విషసంస్కృతిని రూపుమాపుదాం


అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 19: ర్యాగింగ్ ఓ విష సంస్కృతి అని దానిని రూపుమాపాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ర్యాగింగ్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదవుతాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్తును కోల్పోతారన్నారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలన్నారు.

టీడీపీకి బీసీలే కొండంత అండ: బాలాజీ

ఎర్రగొండపాలెంలో జయహో బీసీ సదస్సు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో టీడీపీకి బీసీలే కొడంత అండ అని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో సోమవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో 40 వేల బీసీ ఓట్లు ఉన్నాయన్నారు. వీరు రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీలు అభివృద్ధి చెందుతారన్నారు. అదేవిధంగా పార్టీలో విభేదాలు వీడి టీడీపీ విజయం కోసం కృషిచేయాలన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు అండగా ఉందన్నారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, బీసీలు ఉత్సాహంగా టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో బీసీ కుటుంబాలు అత్యధికంగా ఉన్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు తన విజయానికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి బి చెన్నవీరయ్య మండల టీడీపీ అధ్యక్షులు మేకల వలరాజు, జిల్లా బీసీ నాయకురాలు ఎస్ రమాదేవి, మండల బీసీ నాయకులు తోట మహేష్, కంచర్ల సత్యనారాయణగౌడ్, గుమ్మా ఎల్లయ్య, షేక్ మస్తాన్‌వలి, మూడ మంచు శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు వి రమణమ్మ, డి.వెంకట్రావు, మండలం బీసీ ముఖ్యనాయకులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం మండలంలోని బీసీ నాయకులు జయహో బీసీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ కార్యాలయంనుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించి జ్యోతీరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేశారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీసీ కార్యకర్తలు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ

ధర్నాకు హాజరుకావాలని పిలుపు

గిద్దలూరు, ఫిబ్రవరి 19 : దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేసినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, నిరసనగా ఈ నెల 20న మంగళవారం ఒంగోలులో జరిగే జిల్లాస్థాయి ధర్నాకు హాజరు కావాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసులు, జిల్లా అదనపు కార్యదర్శి ఎస్.హెచ్.కబీర్, గిద్దలూరు, కొమరోలు మండలశాఖల అధ్యక్షులు దేవసహాయం, పిచ్చయ్య ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులతోపాటు రిటైర్డ్ ఉద్యోగులు కూడా హాజరై ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19: మండలంలోని వేములకోట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని రూరల్ ఎస్ఐ వెంకటేశ్వరనాయక్ అరెస్టు చేశారు. పట్టణంలో దాడులు నిర్వహించగా రెడ్డయ్య అనే వ్యక్తి వద్ద 24 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

వైసీపీ గూండాలపై కఠినచర్యలు తీసుకోవాలి

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19: ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరామెన్ లక్ష్మణ్‌పై దాడి చేసిన వైసీపీ గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఎస్.వీ.రమణ డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్‌పై దాడికి నిరసనగా నినాదాలు చేసి కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్‌మీనాకు జర్నలిస్టులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎస్వీ రమణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియాను నియంత్రించాలని కోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. వైసీపీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నపుడు మీడియాపై దాడి చేయడంపై అప్పటి ప్రభుత్వాన్ని విమర్శించారని అన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసీపీ నాయకులు మీడియా వ్యక్తులపై దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి విలేకరులు సుభానీ, జి.మల్లికార్జున్‌రెడ్డి, మీడియా ప్రతినిధులు బాజివలి, సురేష్, అంకయ్య, కృష్ణారెడ్డి, శేఖర్, అంజి, బషీర్, రాజు, షాకీర్ హుస్సేన్ బాబు, రాజ్ కమల్, సుబ్బారావు, మదార్‌వలి పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద విలేకర్ల నిరసన


పొదిలిలో రాస్తారోకో చేస్తున్న మీడియా ప్రతినిధులు

దాడికి నిరసనగా రాస్తారోకో

పొదిలి : జర్నలిస్టులపై దాడులకు నిరసనగా పొదిలి విలేకర్ల ఆధ్వర్యంలో సోమవారం తహసీ ల్దార్ కార్యాలయం నుండి రాస్తారోకో నిర్వహిం చారు. అనంతరం కొందరు విలేకరులు మాట్లాడు తూ అనంతపురం జిల్లా రాప్తాడు ముఖ్యమంత్రి సభలో ఫోటో జర్నలిస్టుపై జరిగిన దాడిని ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా తీవ్రంగా ఖండించి పెద్దబస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మీడియా స్వేచ్ఛను కాపాడాలని, జర్నలిస్టుల ఐక్యత వర్థిల్లా లి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి, తహసీల్దార్, పోలీసుస్టేషన్లలో వినతిపత్రం అందజేశారు. ఈ రాస్తారోకోలో ప్రింట్‌మీడియా, ఎలక్ట్రానిక్‌మీడియ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన


ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహ్మద్‌జియా, సీఐ మల్లికార్జున

పొదిలి, ఫిబ్రవరి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలకు రెవెన్యూ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ మహ్మద్ జియా సోమవారం పరిశీలించారు. మండలంలోని కుంచేపల్లి, ఉన్నగురవాయపాలెం, రాజుపాలెం గ్రామాల్లో ఎన్నికలపై ప్రజలుకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఎలాంటి, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజలు సహకరించాలన్నారు. సీఐ మల్లిఖార్జున్‌రావు మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై కోటయ్య, ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 18: గుండ్లకమ్మ నదీతీరాన వెలసిన లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఏవీకే నరసింహాచార్యుల ఆధ్వర్యంలో తిరుపతి వేద కళాశాల పండితులు వేంకటేశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి కళ్యాణాన్ని తిలకించి పులకరించిపోయారు. రాత్రి స్వామికి గరుడ వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి ఊటుకూరి రామకృష్ణారావు, కోశాధికారి పాదర్తి శ్రీనివాసుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.



లక్ష్మి,పద్మావతి సమేత వేంకటేశ్వరుడు, కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

కంభం, ఫిబ్రవరి 19 : కంభం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రక్త దానం చేయడం వలన ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. శిబిరంలో డిగ్రీ విద్యార్థులు రక్తదానం చేయగా వారికి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురుశంకర్, అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 19: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరి రక్షించాలని వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల ఛైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఉషాతఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఉపాధిహామీ ప్రజావేదికలో అధికారులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 19: ఉపాధిహామీ పనులలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శీనారెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక సోమవారం నిర్వహించారు. 2022 - 2023 ఏడాదికిగాను, మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి గత 10 రోజులుగా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ప్రజావేదికను సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని గ్రామాల్లో నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. మొత్తం రూ. 10.68కోట్లకు పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. కాగా ఎక్కువ గ్రామాల్లో గ్రామంలో లేని వ్యక్తులకు, గ్రామ వలంటీర్లకు మస్టర్లు వేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రతిసారీ ఇదే గ్రామం నుంచి ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని పాతఅన్నసముద్రం క్షేత్ర సహాయకుడిపై పీడీ శీనారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిపురాంతకంలో చేసిన పనుల కొలతలలో, డంపింగ్ యార్డు నిర్మాణ పనుల తేడాలతోపాటు వలంటీర్లకు మస్టర్లు వేశారు. గుట్లఉమ్మడివరం, ముడివేముల, మేడపి, మిరియంపల్లి గ్రామాల్లో చేసిన పనులకు భౌతికంగా ఉన్న కొలతలకు తేడాలు గుర్తించినట్లు డీఆర్పీలు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, డీవీవో ఝాన్సీరాణి, ఏపీడీ నిర్మాలాదేవి, ఎంపీడీవో సాంబశివరావు, ఏపీవో సుజాత, ఎస్‌ఆర్పీ, డీఆర్పీలు పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న పీడీ శీనారెడ్డి

అవీ..ఇవీ..

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- భవిష్యత్తుకు గ్యారెంటీ సభలో గూడూరి ఎరిక్షన్‌బాబు


భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 19: రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది చంద్రబాబు మాత్రమేనని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని గుట్లపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆయన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే పథకాలను, ఆరు గ్యారెంటీలను వివరిస్తూ చంద్రబాబు ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సంక్షేమం అందరికీ అందుతుందని అన్నారు. అనంతరం గ్రామంలోని 15 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. పార్టీలోకి చేరిన వారికి ఎరిక్షన్‌బాబు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వలరాజు, నాయకులు ఎం.శ్రీనివాసరెడ్డి, వీ.ఆంజనేయులు, సునీల్, డి.ఆంజనేయులు, టి.ప్రసాద్, గురునాథం పాల్గొన్నారు.

కాటూరి విగ్రహానికి భూమిపూజ


కొబ్బరికాయ కొడుతున్న నూకసాని బాలాజీ, కందుల నారాయణరెడ్డి

పొదిలి, ఫిబ్రవరి 19 : మాజీ మంత్రి కాటూరినారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠకు కందుల నారాయణరెడ్డి, నూకసాని బాలాజీ సోమవారం కొబ్బరికాయలు కొట్టి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈప్రాంతానికి పెద్దగా ఉన్న నారాయాణస్వామి విగ్రహం పెద్దబస్టాండ్ కూడలిలో ఎన్టీఆర్ విగ్రహ సమీపంలో ఏర్పాటు చేయడం శుభపరిణామనన్నారు. ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజీ మాట్లాడుతూ కాటూరి నారాయణస్వామి పశ్చిమప్రాంతానికి చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు. దశాబ్దాలుగా కాటూరి కుటుంబం ప్రజల సేవలో ఉందన్నారు. నారాయణస్వామి పాలన సమయంలో ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి అని గుర్తు చేశారు. ఆయన సేవలకు కృతజ్ఞతకు ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుమారులు పెద్దబాబు, చినబాబు, కుటుంబ సభ్యులు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా


పొలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 19: రైతులు సాగుచేసిన ప్రతి పంట వివరాలు కచ్చితంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని అధికారులను సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా సూచించారు. మండలంలోని చింతకుంట, తిప్పాయపాలెం, మిట్టమీదపల్లి గ్రామాల్లో రబీ సీజన్ ఈ-క్రాప్ నమోదు వివరాలను సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా ఆయా సర్వే నంబర్లలో రైతులు పంటలు వేశారా..? లేదా..? అని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతుల ద్వారా వివిధ పంటలలో ఆచరిస్తున్న పద్ధతులు నీటి యాజమాన్య పద్ధతులు, దిగుబడులను గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సాగుచేస్తున్న వివిధ పంటలను ఎప్పటికప్పుడు ఎలాంటి అవకతవకలు లేకుండా సాగుదరుని పూర్తి వివరాలతో పంట నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్కాపురం ఏడీఏ రమాదేవి, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, హెచ్‌వో రమేష్‌బాబు, చింతకుంట, భూపతిపల్లి వీఏలు వెంకటేశ్వరరెడ్డి, రమణి, గ్రామసర్వేయర్ సుబ్బారెడ్డి, వీఆర్‌వోలు పరుశురాం, మాబువలి, రైతులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల పంపిణీ


ఉపకార వేతనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గిద్దలూరు, ఫిబ్రవరి 19 : ప్రతిభ ఉన్న పేద ఆర్యవైశ్య విద్యార్థులకు శ్రీవాసవి పేద విద్యార్థుల సేవాసంస్థ ఉపకార వేతనాలను పంపిణీ చేసింది. స్థానిక అమ్మవారిశాలలో జరిగిన కార్యక్రమంలో 20 మంది ప్రతిభ ఉన్న పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.2లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసంస్థ అధ్యక్షులు బొగ్గరపు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బొగ్గరపు వెంకటరామయ్య, కోశాధికారి రాచపూటి నరసింహారావు, ఉపాధ్యక్షులు శివపురం పీరయ్య, తుమ్మలపెంట సత్యనారాయణ, లీగల్ అడ్వైజర్ శివపురం నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

గిద్దలూరు, ఫిబ్రవరి 19 : పన్ను బకాయిలను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని మున్సిపల్ కమీషనర్ వి.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కొంగలవీడు సచివాలయ పరిధిలో పన్ను బకాయిలు ఉన్న ఇళ్ళకు ఆయన స్వయంగా వెళ్ళి త్వరితగతిన పన్ను బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డబుల్‌ఎంట్రీలను తొలగించాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, ఫిబ్రవరి 19 : ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఇతర ప్రాంతాలలో నివసిస్తూ అక్కడ, ఇక్కడ ఓట్లు నమోదు చేసుకున్న వారిని ఒక చోటే ఉంచి రెండోచోట తొలగించాలని బీజేపీ నాయకులు స్థానిక రెవెన్యూ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే చనిపోయిన వారి ఓట్లను తొలగించాలని, లేకపోతే దొంగఓట్లు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ రాష్ట్రకార్యవర్గ సభ్యులు పిడతల రమేష్‌రెడ్డి, అసెంబ్లీ కోకన్వీనర్ గుమ్మా రాముడు, ఓబీసీ మోర్చ నాయకులు దూదేకుల బాదుల్లా, కంచర్ల ప్రవీణ్‌కుమార్, నున్నా వీరచక్రం పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజి జయంతి

గిద్దలూరు, ఫిబ్రవరి 19 : పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశాన్ని కాపాడుకు నేందుకు శివాజీ చూపిన తెగువను కొనియాడారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ, ఇన్‌చార్జి బ్రహ్మేశ్వరప్రసాద్, పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, బిజెపి నాయకులు ముప్పూరి శ్రీనివాసులు, రాచర్ల కాసులు, తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం

- అప్పటి మంత్రి బాలినేని శంకుస్థాపన
- నాలుగేళ్లుగా ముందుకు సాగని పనులు
- అమలుకాని ఎమ్మెల్యే మద్దిశెట్టి హామీ
- రైతులకు తప్పని లోవోల్టేజీ సమస్య


విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణం కోసం తీసిన పునాది గుంతలు.. మాజీ మంత్రి బాలినేని శంకుస్థాపన చేసిన శిలాఫలకం.. నిరుపయోగంగా సామగ్రి

తాళ్లూరు, ఫిబ్రవరి 19 : వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగమేఘాలపై 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుపై చేసిన ప్రకటనకు నాలుగేళ్లయింది. దాని నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయంటూ పనులకు అప్పటి ఆ శాఖ మంత్రి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే మద్దిశెట్టి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి 60 గ్రామాలకు చెందిన వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సాక్షాత్తూ అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనవరి 2020లో రూ.22.7కోట్ల నిధులతో 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల పూర్తయినా ఒక్క అడుగు కూడా పడలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన గ్రామాల్లో భూగర్భ జలాలు అధికంగా ఉండడంతో రైతాంగం వ్యవసాయ బోర్లపై ఆధారపడి వ్యవసాయ పంపు సెట్ల మోటార్ల ద్వారా పంట సాగు చేస్తున్నారు. దీంతో విద్యుత్ వాడకం అధికంగా ఉండడంతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా అధికంగా ఈ మండలంలో 10 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తాళ్లూరు పరిసరగ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు శ్రద్ధ కనపరిచి శివరాంపురం గ్రామ శివారు తూర్పుగంగవరం - బీమవరపు వెళ్లే మార్గంలో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి విద్యుత్ శాఖకు అప్పగించారు. అప్పటి మంత్రి బాలినేని రైతులపై ప్రేమతో వ్యవసాయ విద్యుత్‌కు సహకారం అందిస్తూ తక్షణమే నిధులు మంజూరు చేస్తూ ఆర్భాటంగా శంకుస్థాపన కూడా చేశారు. విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ ప్రాంతంలో లక్షలు వెచ్చించి మట్టిని తోలి చదును కూడా చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. శంకుస్థాపన చేసిన ఏడాది కాంట్రాక్టర్ మెటీరియల్‌ను, సామగ్రిని తోలారు. ఆ మెటీరియల్ పోకీకి గురైంది. దీంతో మిగతా సామగ్రి కోసం జీతం ఇచ్చి కాపలాదారుడిని నియమించారు. ప్రస్తుతం అతడికి జీతం చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉప కేంద్ర నిర్మాణం ఎప్పుడు చేస్తారో తమ సమస్యలు ఎప్పుడు తొలిగిపోతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుండగా విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణం కలగానే మిగులుతుందని ప్రజలు, రైతులు పెదవివిరుస్తున్నారు.


బ్రహ్మంగారి ఆలయం వద్ద భక్తులు

వైభవంగా బ్రహ్మంగారి విగ్రహ ప్రతిష్ఠ

కురిచేడు, ఫిబ్రవరి 19: కురిచేడులో సోమవారం గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం దర్శి రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో వైభవంగా ప్రతిష్ఠించారు. ఋత్వికుల వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. వేదపాఠశాల ప్రధానోపాధ్యాయులు అత్తలూరి బాల శంకరశాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. స్థానిక విశ్వబ్రాహ్మణులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ పూజా మండపాన్ని నిర్మించారు. ప్రతిష్ఠ అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, ఫిబ్రవరి 19 : పట్టణంలోని తూర్పువీధిలోని రామాలయంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత, శ్రీ సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నేటి నుంచి 22 వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


తీర్మానాలు ప్రతిపాదిస్తున్న అధికారులు

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

దర్శి, ఫిబ్రవరి 19 : దర్శి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో మురికి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మించేందుకు ప్రణాళిక బద్ధంగా నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వివిధ పనులకు సాధారణ నిధుల రూ.90 లక్షలు వినియోగించేందుకు అధికారులు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ జే స్టీవెన్, తలారి కోటయ్య, కమిషనర్ వైమహేశ్వరరావు, డీఈ రహీమ్, సభ్యులు పాల్గొన్నారు.

స్వాతికి శిక్షా రతన్ అవార్డ్


స్వాతికి అవార్డును అందిస్తున్న లయన్స్ అధ్యక్షుడు

కురిచేడు, ఫిబ్రవరి 19 : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి వారికి విద్యలో నైపుణ్యాలను వెలికి తీసే ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఇచ్చే శిక్షా రతన్ అవార్డు 2023-24 విద్యా సంవత్సరంలో కురిచేడు మండలంలోని బోదనంపాడు ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వల్లెం స్వాతికి దక్కింది. స్వాతి విద్యార్థులకు సీబీఎస్ఈ పద్ధతిలో సులభమైన రీతిలో పాఠ్యాంశాలు బోధిస్తారనే పేరు ఉంది. ఆమె సేవలను గుర్తించి ఆమెకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషకరమని మండల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు. జాతీయ స్థాయి అవార్డును లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీరరమణారావు సోమవారం అందజేశారు. విద్యార్థులను ఉన్నత స్థితిలోకి తీసుకు రావడానికి కృషి చేయాలని ఆమెకు సూచించారు. స్వాతిని మండల ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మౌలాలి


నియామకపత్రం అందుకుంటున్న మౌలాలి

పామూరు, ఫిబ్రవరి 19 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్యామ లాల మౌలాలిని నియమించినట్లు పీసీసీ నియోజకవర్గ సమన్వయ పిల్లి వెంకటేశ్వరరెడ్డి ప్రకటించారు. బాబా బీడీఎస్ షోరూంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల సమయంలో పలువురు ముఖ్య నాయకులు పీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల సమక్షంలో పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని మౌలాలి అన్నారు. సమన్వయ కమిటీ సభ్యులు హుస్సేన్, మస్తాన్, సతాం, సుభానీ పాల్గొన్నారు.


శోభాయాత్ర చేస్తున్న మరాఠీలు

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

పామూరు, ఫిబ్రవరి 19 : పరాయిపాలన నుంచి దేశ విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ విశ్వజన హిందూ హృదయ సామ్రాట్ అని బీజేపీ కనిగిరి అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. ఆరే మరాఠా వెల్ఫేర్ అసోసియేషన్, శివాజీ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంత్యుత్సవాలను సోమవారం నిర్వహించారు. రామాలయంలోని శివాజీ విగ్రహానికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి జగదాబి మల్లాది, జాజుల శ్రీనివాసులు, జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. డీజే, బాణసంచా కాల్పులతో ప్రధాన వీధుల్లో వైభవంగా శివాజీ చిత్రపటంతో శోభాయాత్ర సాగింది. కార్యక్రమం అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ జాజుల వెంకటేశ్వర్లు, వైఎస్ శివశంకర్, బీజేపీ మండల అధ్యక్షుడు చినసుబ్బయ్య, జగదాబి సునీల్, శ్రీరాములు, నరేష్, ఓబులేస్, ఎం.హేమంత్, సురేష్, హరగోపాల్, ఆనంద్, శ్రీకాంత్ మధు, సురేంద్ర, హనుమంతు, మంజునాథ్, శంకర్, సుభాషిణి, రమణమ్మ పాల్గొన్నారు.

ఆరే మరాఠా నూతన కార్యవర్గం

పట్టణ ఆరే మరాఠా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. మరాఠా సంఘం పట్టణ అధ్యక్షుడిగా జాజుల శివాజీ, ఉపాధ్యక్షుడిగా సాయికృష్ణ, కార్యదర్శిగా టీ సురేంద్ర, కోశాధికారిగా జాజుల కృష్ణ, సహాయ కోశాధికారిగా వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర.. కనిగిరి ధర్నాలో మాట్లాడుతున్న సంధాని.. దర్శిలో వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మీడియా ప్రతినిధులపై దాడులు అమానుషం

» ఖండించిన ఎమ్మెల్యే ఉగ్ర, టీడీపీ మైనారిటీ అధికార ప్రతినిధి రోషన్ సంధాని » విలేకరుల నిరసనలు

కనిగిరి, ఫిబ్రవరి 19 : మీడియా వ్యక్తులపై దాడులు చేయడం అమానుషమని రాష్ట్ర టీడీపీ మైనారిటీ అధికార ప్రతినిధి రోషన్ సంధాని అన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా కనిగిరిలో జర్నలిస్టులు సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనకు రాప్తాడులో మీడియా జర్నలిస్టులపై దాడి ఘటన అద్దం పడుతుందని సంధాని అన్నారు. ప్రజలంతా దీనిని ఖండించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ షఫీ దాడిని ఖండించారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మాకినేని నరసింహ, తిరుమల, ప్రసాద్, కుమార్, మధు, దానయ్య, పవన్, నారాయణరెడ్డి, బాబు, మనోహర్, ఏడుకొండలు, రాంబాబు, నాగరాజు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

పామూరు : మీడియా ప్రతినిధులపై వైసీపీ గూండాలు దాడులు అమానుషమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక శేషమహల్ థియేటర్‌లో పార్టీ నాయకులతో విలేకరులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్ర ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడిని ఖండించారు. ప్రభుత్వ అవినీతి అరాచకాలపై ప్రశ్నించేవారిపై దాడులు చేస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయన్నారు. ప్రజలు కూడా ఫ్యాన్ రెక్కలను విరిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఉగ్ర హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్‌లు డీవీ మనోహర్, కాంటి సుబ్బయ్య, కే సుభాషిణి, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ బాజారహంతుల్లా, ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నాగేశ్వరావు, పోరెమన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి జ్వాల, షేక్ గౌస్‌బాషా, పంబలి హరీష్, మస్తాం రమణయ్య, జాజుల వెంకటేశ్వర్లు, డోలాశేషాద్రి, దేవరపు మాల్యాద్రి, ఎస్.సాంబ, ఫలిసాయి, జీ హరీష్, కొలూరి రహంతుల్లా, చిన హజరత్, యాదాల మాలకొండయ్య, శివశంకర్, పువ్వాడి వెంకటచౌదరి, ఎంనరసింహారావు, పువ్వాడి రామారావు, మాదల రహిమాన్, మౌషే, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

దర్శి : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దర్శి జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులు పి వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, శ్రీనివాసరావు, వెంకట్, కంచారావు, మధు, కిశోర్, వెంకటరెడ్డి, కాజీ, ప్రసన్న ఎస్‌డీపీవో నీసీ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు.

పీసీపల్లి : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి పిరికిపంద చర్య అని, దీనిని తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మండల నాయకులు అన్నారు. సోమవారం మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, మాజీ అధ్యక్షుడు ములకా నాగేశ్వరరావు, వీరవని పెద్దన్న, మాలకొండయ్య, మాదర్తు, నానిబాబు, ముసలయ్య, శ్రీనివాసులు, ఏసుగుంట నాగేంద్రబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ విధానాలపై 24 నుంచి ప్రజాపోరు

పామూరు, ఫిబ్రవరి 19 : వైసీపీ ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాల ను నిరసిస్తూ ఈనెల 24 నుంచి ప్రజాపోరు కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న జీసీడీవో

తాళ్లూరు, ఫిబ్రవరి 19 : మార్చిలో జరుగనున్న పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా సమగ్ర జీసీడీవో ప్రమీలా రాణి సూచించారు. స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని సోమవారం సందర్శించారు. మార్చిలో జరిగే పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో బాలికలు అత్యధిక మార్కులు సాధించేందుకు పలు సూచనలు చేశారు. విద్యాలయం ఉపాధ్యాయులు కూడా నూరుశాతం ఉత్తీర్ణత సాధించేదుంగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ జి.సుజిత, సీఆర్‌టీలు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికార బృందం

పోలింగ్ బూత్ పరిశీలన

దొనకొండ, ఫిబ్రవరి 19 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మండలంలోని ఒకటి నుంచి ఎనిమిది పోలింగ్ కేంద్రాలను మండల స్థాయి అధికారులు సోమవారం పరిశీలించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు, ఎంఈవో సాంబశివరావు, ఏఎస్ఐ శ్రీనివాసరావులు చందవరం, పోలేపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంట్, నీటి వసతి, వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంపులు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో సౌజన్య, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి బూచేపల్లి విరాళం

దొనకొండ, ఫిబ్రవరి 19 : మండలంలోని చందవరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. పార్టీ మండల ఇన్‌ఛార్జి రమణారెడ్డి సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి కుటుంబానికి ఆలయ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వజ్జిగిరి రాణి, వైసీపీ నాయకులు యగ్గోని కృష్ణారెడ్డి, రవికుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జడ్పీ వైర్ పర్సన్ వెంకాయమ్మ

సిమెంట్ రోడ్డు ప్రారంభం

దొనకొండ, ఫిబ్రవరి 19 : మండలకేంద్రమైన దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలో రూ.10 లక్షల జడ్పీ నిధులతో నిర్మాణం చేపట్టిన సిమెంట్ రోడ్డును జడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సోమవారం రాత్రి ప్రారంభించారు. వెంకాయమ్మ, వైసీపీ ఇన్‌ఛార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డికి వైసీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ జడ్పీ నిధులతో దొనకొండలో అవసరమైన అన్నిచోట్లా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగర్ల ఉషామురళి, సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌లక్ష్మకుమారి, దేవానంద్, నాయకులు కర్నాటి అంజనేయరెడ్డి, తమ్మనేని సుబ్బారెడ్డి, బలారి శ్రీనివాసులురెడ్డి, షేక్ గఫార్, ఉపసర్పంచ్‌వహన ఇమామ్, ఎంపీటీసీ గుంటు అమ్మాజీ, అజయ్, బత్తుల వెంకటసుబ్బయ్య, ముజాహిద్, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


జంకెకు బొకే ఇచ్చి అభినందిస్తున్న బాలినేని

జంకెను అభినందించిన బాలినేని

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : ఏపీఐఐసీ చైర్మన్‌గా వైసీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని కార్యాలయంలో సోమవారం జంకె బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలను స్వీకరించిన జంకె వెంకటరెడ్డిని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా జంకె మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. జంకె వెంకటరెడ్డిని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, కాకుమాను రాజశేఖర్ తదితరులు అభినందించారు.

పోలీసు స్పందనకు 86 ఫిర్యాదులు

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి 18 : పోలీసు స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 86 మంది తమ వినతులను అందజేశారు. సోమవారం పోలీసు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీధరరావు ప్రజలనుంచి వినతులను స్వీకరించారు.

చేనుకు చీర కంచె



ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అడవి పందుల నుంచి కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారుతోంది. కంచెను సైతం పడేసి అడవి పందులు పంటను నాశనం చేస్తున్నాయి. పంటను కాపాడుకునేందుకు పగలంతా పొలాల వద్ద కాపలాఉన్నప్పటికీ రైతులు రాత్రి వేళ అడవి పందులు రాకుండా ఉండేందుకు కొత్తకొత్త ప్రయత్నాలు చేస్తున్నారు. అడవి పందులు పొలాలకు రాకుండా చుట్టూ చీరలను కంచెల వలె కడుతున్నారు. రంగురంగుల పాత చీరలతో పొలాలకు రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాత్రిపూట వచ్చే పందులు రంగురంగుల చీరలను చూసి, హోరు గాలి శబ్దానికి పొలాల వద్దకు రావడం లేదని రైతులు చెప్తున్నారు. - పామూరు

దేవస్థాన నిర్మాణానికి విరాళాల సేకరణ


దేవస్థానానికి వచ్చిన విరాళాలను ప్రకటిస్తున్న దారపనేని

పామూరు, ఫిబ్రవరి 19 : మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతీ పరిధిలోని నర్సులగుంట గంగమ్మతల్లి దేవస్థాన నిర్మాణానికి విరాళాల రూపంలో రూ.3,33,116 సేకరించినట్లు కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రకటించారు. దారపనేని క్యాంప్ కార్యాలయంలో దేవస్థాన కమిటీ సభ్యులతో సోమవారం ఆయన మాట్లాడారు. ఆలయ నిర్మాణం కోసం సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ బొయ్య నారాయణరెడ్డి, బ్రైదెడ్డి జయరామిరెడ్డి ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్, అయ్యప్ప దేవస్థాన చైర్మన్ గుత్తి రాజా, ఎస్సీ నారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, పోలానాయుడు బాబు తదితరులు విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో వైటీసీ మాజీ సభ్యుడు వనికల పెదమాలకొండయ్య, మానం మల్లికార్జునరావు, కొండలరావు, దారపనేనిరాజు, వెంకటరత్నం, చిన మాలకొండయ్య పాల్గొన్నారు.

చెక్కు అందజేత

తాళ్లూరు, ఫిబ్రవరి 19 : మండలంలోని మాధ్వరం గ్రామానికి చెందిన మందాది చిన శేషయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి లక్షా 20 వేల రూపాయల నగదు చెక్కును దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి దర్శిలో సోమవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ కాలేషావలి దరియావలి తదితరులు పాల్గొన్నారు.

మదర్ సేవా సమితి సేవలు అభినందనీయం


పారిశుధ్య కార్మికులకు అన్నదానం చేస్తున్న రవి

కనిగిరి, ఫిబ్రవరి 19: మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జిరాక్స్ సెంటర్ రవి తన భార్య రాజేశ్వరి పుట్టినరోజు జ్ఞాపకార్థం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పాతకేటు రవి కుటుంబం సేవా భావంతో ముందుకు వెళ్తుందని మదర్ సేవా సమితి ద్వారా చేపట్టిన పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు రసూల్, వసంతుల అరుణోదయ్, ఏఈఎం శేఖర్, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీను, బీసీ సంక్షేమ సంఘం నాయకులు విజయరామరాజు, బేరి బాస్కర్‌రెడ్డి, ఆర్యవైశ్యనాయకులు వెంకటేశ్వర్లు, బీసీ సంఘ నేత చింతలపూడి వెంకటేశ్వర్లు, ఈర్ల గురవయ్య పాల్గొన్నారు.



నకిలీ దందా



- నట్టేముంచిన నకిలీ విత్తనాలు
- దుగ్గిరాల రైతులు పూర్తిగా మునిగిపోయారు...
- మిర్చి రైతుల నష్టం అపారం
- అక్కడ కేజీ రూ.6 వేలు కొని.. ఇక్కడ రూ.1.20 లక్షలకు అమ్మకం
- ఉద్యోగులకు కంపెనీల్లో వాటాలు
- గుంటూరు నుంచే అన్ని చోట్లకు సరఫరా

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 19: విత్తన ఎంపికలోనే రైతు మీద దెబ్బ పడుతోంది. ఏది అసలో ఏది నకిలీనో తెలుసుకోలేని సందిగ్ధావస్థ అన్నదాతను తిప్పలపాలు చేస్తోంది. ఖరీఫ్, రబీ అన్న తేడా లేకుండా రైతులు విత్తనాల విషయంలో మోసపోతూనే ఉన్నారు. విత్తనాల కంపెనీల మాటల ఆకర్షణలో పడి నిండా మునిగిపోతున్నారు. పంట చేతికి రావలసిన సమయానికి మోడుబారిన చెట్లను చూసి గుండె పగులుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నగరంలో నుంచే విత్తనాలు సరఫరా అవుతున్నాయి. వాటిల్లో చాలాభాగం నకిలీవి కూడా ఉంటున్నాయి. ఉన్నతస్థాయి అధికార యంత్రాంగం ఇక్కడే ఉన్నప్పటికీ పర్యవేక్షణ కరువవ్వటంతో అన్నదాతల బతుకుల్లో బండలు పడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో పనిచేసే కొందరు ఉద్యోగులకు విత్తనాల కంపెనీల్లో వాటాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

రైతు శ్రమ బూడిదలో పోసిన పన్నీరు..

దుగ్గిరాల మండలం మంచికలపూడిలో కొందరు రైతులు క్యాలీఫ్లవర్ సాగు చేశారు. అందుకోసం గుంటూరు నుంచి విత్తనాలను తీసుకువెళ్లారు. 75 రకం, వైట్ సుప్రీమ్ గోల్డ్ విత్తనాలను సాగు చేశారు. పైరు ఏపుగా పెరిగింది కానీ పువ్వు రాలేదు. పెరిగిన పైరు క్రమంగా ఎండిపోయింది. అది గమనించిన రైతులు స్థానిక వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు పరుగులు తీశారు. తాము మోసపోయామని గ్రహించారు. ఈ పంట సాగుకు ఒక్కో రైతుకు సుమారు రూ.60 వేల వరకు వరకు ఖర్చయినట్లు తెలుస్తోంది. విత్తనాలు ప్యాకెట్లు కూడా ఒక్కొక్కటి రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేశారు. పెదనందిపాడుకు చెందిన కిషోర్ ఈ ఏడాది మిర్చిపంట సాగు చేశాడు. అన్నవరం సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుకు ఉపక్రమించాడు. మొక్కలు ఏపుగా పెరిగినప్పటికీ కాపు రాకపోవడంతో పంటను ధ్వంసం చేసి శనగ వేసుకున్నాడు. శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల నుంచే తీసుకున్నప్పటికీ అవి కూడా సరిగా మొలవకపోవడంతో ఆ పంటను తీసేసి మొక్కజొన్న నాటుకున్నాడు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం తాళ్ళచెరువులో కొందరు రైతులు గుంటూరు నుంచి తీసుకువెళ్లారు. మిర్చి విత్తనాలను నారుగా పోశారు. అవి మొలకెత్తక పోవటంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. రెంటచింతల మండలంలోని కొందరు రైతులు ఇదే అనుభవాన్ని ఎదుర్కొన్నారు. విత్తనాలను విక్రయిస్తున్న డీలర్లు రైతుల్లోని నిరక్షరాస్యతను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారు. అందమైన ప్యాకింగ్‌లను చూపించి విత్తనాలను రైతులకు అంట గడుతున్నారు. విత్తనాలు విక్రయించే సందర్భంలో తగినవిధంగా బిల్లులు ఇవ్వకపోవడంతో రైతులు పోరాడే అవకాశాన్ని కోల్పోతున్నారు.

మిర్చి విత్తనాలకు ఇదే సీజన్..



ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రాకు వివిధ రకాల విత్తనాలు ఫిబ్రవరి, మార్చి నెలలోనే సరఫరా అవుతాయి. కర్ణాటక లోని రాణి బెంగళూరు ప్రాంతం నుంచి మిర్చి విత్తనాలను గుంటూరు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. అక్కడ మిర్చి విత్తనాలు కేజీ రూ.6 వేలకు కొనుగోలు చేసి ఇక్కడ గ్రాముల చొప్పున ప్యాకింగ్ చేస్తారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలను కేజీ రూ.లక్షా ఇరవై వేల వరకు అమ్మడం జరుగుతుంది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి పత్తి విత్తనాలను కొనుగోలు చేసి తీసుకొస్తారు. వాటికి యాసిడ్, సున్నం కలిపి ఆరబెట్టిన తర్వాత ప్యాకింగ్ చేస్తారు. వాటిని కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గుంటూరు నగరం లో సుమారు 20వరకు విత్తన కంపెనీలు ఉన్నాయి. విత్తన నాణ్యతను పెద్దగా పరిశీలించకుండానే డైరెక్ట్‌గా మార్కెట్లోకి విడుదల చేయటంతో రైతులు సాగులో నష్టపోతున్నారు.

తనిఖీలు లేవు...

రాష్ట్రాల నుంచి గుంటూరుకు మిర్చి పత్తి విత్తనాలు స్థానిక పార్సిల్ కేంద్రాల ద్వారా సరఫరా అవుతున్నాయి. సరైన రీతిలో తనిఖీలు జరపకపోవడంతో నకిలీ విత్తనాలు మార్కెట్లోకి వెళ్లిపోతున్నాయి. వ్యవసాయ శాఖలోని కొందరు ఉద్యోగులు విత్తన కంపెనీలో వాటాదారులుగా ఉండటంతో తనిఖీలు తూతూమంత్రంగా సాగుతాయన్న అపప్రద ఉంది.

ఓటు.. ఓ డౌటు



- తుది జాబితా ప్రచురణ తర్వాత వచ్చిన దరఖాస్తులు 18,920
- మళ్లీ 5814 ఫాం7ల దాఖలు
- ఫాం7ల విషయంలో కొనసాగుతున్న పాలక పార్టీ కుయుక్తులు
- ఓట్లు తొలగించే విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్
- చేర్పుల విషయంలో యంత్రాంగానికే వెసులుబాటు

బాపట్ల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనవరి 22న ఓటర్ల తుది జాబితాను ఈసీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికి రెండు వారాల ముందే ఆనలైన్‌లో ఓట్లకు సంబంధించి ఫాంలను దరఖాస్తు చేసే అవకాశాన్ని ఫ్రీజ్ చేసిన ఈసీ తిరిగి జనవరి 23 నుంచి అందుకు అవకాశం కల్పించింది. అప్పటి నుంచి ఫిబ్రవరి 19 వరకు వచ్చిన మొత్తం దరఖాస్తులు 18,920. ఇందులో ఫాం6లు 7334 కాగా, ఫాం7లు 5814, ఫాం8లు 5772గా ఉన్నాయి. ఫాం6, 8ల విషయంలో గతంలో నిబంధనలే ఉండగా ఫాం7 ద్వారా ఓటు తొలగించాలంటే నిర్దిష్టమైన మార్గదర్శ కాలను ఇప్పటికే ఈసీ జారీ చేసింది. గతంలో జిల్లాలో ముఖ్యంగా పర్చూరులో ఫాం7ల విషయంలో అనేక ఆరోపణలు రావడంతో పాటు పోలీసు అధికారులు సస్పెన్షన్‌కు కూడా గురి కావడం జరిగిన సంగతి తెలిసిందే. వీటన్నింటి నేపథ్యంలో మళ్లీ జిల్లావ్యాప్తంగా 5,814 ఫాం7లు ఈ నాలుగు వారాల వ్యవధిలోనే రావడం, అందులో 843 పర్చూరుకు సంబంధించినవే ఉండడం గమనార్హం.

ఇలా విచారించాలి..



తుది ప్రచురణ దగ్గర నుంచి ఇప్పటివరకు 5814 ఫాం7లు వచ్చాయి. నియోజకవర్గాల వారీగా ప్రచురించిన తుది జాబితాలోని ఓట్లు కొలమానంగా ఇందులో 0.1 శాతం లోపు మాత్రమే ఫాం7ల ద్వారా ఓట్ల తొలగింపు జిల్లా కలెక్టర్ ఆమోదంతో జరగాల్సి ఉంటుంది. ఆ శాతానికి మించి తొలిగించాల్సి వస్తే ఆ పేర్లను సీఈవో కార్యాలయానికి పంపి అక్కడ తుది ఆమోదం లభించాకే ముందుకు వెళ్లాలి. లేకుంటే వాటిని తిరస్కరణ జాబితాలోనే చేర్చాలి. ఇప్పటికే వీటిలో కొన్నింటిపై విచారణ పూర్తి చేసిన యంత్రాంగం వాటిని కలెక్టర్ లాగిన్ లోకి పంపారనేది సమాచారంగా ఉంది.

అధికారపార్టీ తీరుపైనే అనుమానాలు...

గతంలో ఫాం7లను పాలకపార్టీ సానుభూతిపరులు గంపగుత్తగా దరఖాస్తు చేసేవారు. ఈసీ నిబంధనలు కఠినతరం చేయడంతో రూటు మార్చి ఇప్పుడు ఒక్కొక్కరు 5కు లోబడి ఫాం7లను నమోదు చేసే ప్రక్రియను కొనసాగిస్తూనే ఉన్నారని ఆరోపణను టీడీపీ చేస్తోంది. వాటిని దాఖలు చేసిన వారి పూర్వాపరాలపై కూడా విచారణ చేసి తుది నిర్ణయానికి రావాలని విపక్షాలు కోరుతున్నాయి. నేతల ఒత్తిళ్ల పర్వంమీద కూడా గతంలో ఆరోపణలు వచ్చాయని, ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారనే విమర్శను టీడీపీ చేస్తోంది. ఓట్ల తొలగింపు కోరుతూ దాఖలైనా 5,814 దరఖాస్తుల్లో దాదాపు 2,000 వరకు గతంలో యంత్రాంగం తిరస్కరించినవే ఉన్నాయని తెలుస్తోంది. ఈ విషయంలో పాలకపార్టీ మద్దతుదారులు పదేపదే ఫాం7లను దాఖలు చేస్తూ యంత్రాంగానికే సవాల్ విసురుతున్నారు.

కేసులు నమోదుతో సరి.. చర్యలేవీ..

పర్చూరు నియోజకవర్గ ఈఆర్వో ఫిర్యాదు మేరకు 22 మందిపై పోలీసులు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. వీరితో పాటు మరో 23మందిపై పోలీసులు స్వచ్ఛందంగా కేసు నమోదు చేశారు. ఇదంతా జరిగి నెలలు గడుస్తున్నాయి. కానీ వారిపై చర్యలు కొరవడ్డాయి. కేవలం కేసులు నమోదుతో సరిపెట్టారే తప్పితే వాటి పురోగతి విషయంలో ఇప్పటి వరకు అంగుళం కదలిక కనబడకపోవడాన్ని టీడీపీ తప్పుబడుతోంది. ఇంత జరిగినా మళ్లీ యథేచ్ఛగా ఫాం7లు దాఖలవడానికి కారణం చర్యలు ఉండవనే బరితెగింపే కారణమని విపక్షాలు అంటున్నాయి. ఇప్పటికైనా కేసులు నమోదు చేసిన వారిపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి చర్యలు చేపట్టాలని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఇంటర్ పరీక్షలకు.. 19,853 మంది

- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ పి.రంజిత్‌బాషా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 19: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మార్చి1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతాయన్నారు. జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9,090 మంది ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 10,763 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొత్తం జిల్లా నుంచి 19,853 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 400మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 450 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించామని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌టీమ్‌లను రెండు, కస్టోడియన్స్, సిట్టింగ్ స్క్వాడ్‌టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఉదయం 9గంటలు నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఆ సమయంలో పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూతవేయించాలని చెప్పారు. కేంద్రాల వద్ద విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక వైద్యకిట్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఇంటర్మీడియట్ ఆర్ఐవో పి.యర్రయ్య, జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు, డీపీవో రవికుమార్, డీఎమ్‌అండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్టీసీ ఆర్ఎం వి.కృష్ణారెడ్డి, ఏవో కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ దొంగలు



- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు
- రాత్రి సమయాల్లో తగ్గిన పోలీసుల గస్తీ
- అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్

అద్దంకి, ఫిబ్రవరి 19: తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరుగుతున్నాయి. ఇటీవల కాలంలో అద్దంకి పట్టణంతో పాటు మండలంలో జరిగిన చోరీలను పరిశీలిస్తే అన్నీ తాళాలు వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. గత రెండు, మూడు నెలల వ్యవధిలోనే సుమారు పది ఇళ్లలో చోరీలు చోటుచేసుకున్నాయి. మూడు నెలల క్రితం అద్దంకి పట్టణంలోని సాయినగర్ (కమలేశ్వరస్వామి మాన్యం)లో రెండు ఇళ్లలో, నెల రోజుల క్రితం విశ్వభారతి స్కూల్ రోడ్డులోని టవర్ సమీపంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఆది వారం రాత్రి అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో భారీ చోరీ జరిగింది. మండలంలోని శ్రీనివాసనగర్‌లో నెల రోజుల క్రితం రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. పది రోజుల క్రితం గోపాలపురంలో పట్టపగలే చోరీ చోటుచేసుకుంది. ఇలా పగలు, రాత్రి తేడా లేకుండా తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలు జరిగాయి. నేరుగా తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి బీరువాలు తెరిచి చోరీలకు పాల్పడుతున్నారు. వీటిలో అత్యధిక శాతం చోరీలు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే శివారు గృహాలు కావటంతో పాటు నామ్ రోడ్డుకు సమీప ప్రాంతాలు కావటం విశేషం. దీనిని బట్టి చోరీలకు పాల్పడిన తరువాత సులువుగా తప్పించుకొని వెళ్లేందుకు వీలుగా ముందుగా రెక్కీలు నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తేటతెల్లమవుతోంది.



అద్దంకిలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడవేసిన దుస్తులు, వస్తువులు

అటకెక్కిన ఎల్‌హెచ్‌ఎంఎస్...

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు జరగకుండా పోలీసుల పర్యవేక్షణ ఉండేవిధంగా లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) ఏర్పాటుచేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే కుటుంబాలు పోలీసులకు ముందస్తుగా సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షణ జరిగేది. గతంలో ఈ పద్ధతి ద్వారా కొంతమేర సత్ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు పూర్తిగా అటకెక్కింది. రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ కూడా అంతంతమాత్రంగానే ఉంటుందన్న విమర్శలు వస్తున్నాయి. అదే సమయంలో నామ్ హైవేపై గతంలో గస్తీకి అద్దంకి నియోజకవర్గ పరిధిలో రెండు పోలీస్ మొబైల్ వాహనాలు ఉండేవి. ప్రస్తుతం ఒకదానినే పరిమితం చేయటంతో పాటు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే మారిందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చి చోరీలకు పాల్పడి తప్పించుకునేందుకు వీలుగా మారటంతో చోరీలు అధికమయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి చోరీలు జరగకుండా మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



వల్లాపల్లిలో అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

వైసీపీలో వర్గపోరు

- పనులు పూర్తి చేయకుండానే సచివాలయం ప్రారంభం
- బిల్లు ఇవ్వకుండా ప్రారంభం చేశారని కాంట్రాక్టర్ ఆవేదన
- ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నారని ఆరోపణ

బల్లికురవ, ఫిబ్రవరి 19: మండలంలోని వల్లాపల్లి వైసీపీలో వర్గపోరు బహిర్గతమైంది. గ్రామంలో వైసీపీకి చెందిన నాయకుడు మందా వీరాంజనేయులు గ్రామ సచివాలయ భవన పనులు చేస్తున్నారు. ఇంకా కొంత పనులు చేయాల్సి ఉంది. ఇందుకుగాను ఫైనల్ బిల్లు రూ.5.70 లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఇవేమి పట్టించుకోకుండా వల్లాపల్లి గ్రామంలోని వైసీపీలోని రెండో వర్గం నేతలు నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనానికి వేసి ఉన్న తాళాన్ని అధికారుల ద్వారా పగలగొట్టించారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డితో సోమవారం రాత్రి ప్రారంభించే చర్యలు చేపట్టారు. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ తనకు తెలియకుండా తనకు చెల్లించాల్సిన బిల్లులు రాకుండా ఎలా ప్రారంభిస్తారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా తనకు బిల్లులు ఇవ్వకుండా తన పేరు శిలాఫలకంపై వేయకుండా భవనం కిందిభాగంలో శిలాఫలకం వేసి ప్రారంభించారని కాంట్రాక్టర్ వాపోయాడు. తాను వైసీపీలో ఉన్నా ఇలా చేశారని, ఇదేమి న్యాయమని అన్నారు. ఎస్సీని అని చిన్నచూపు చూశారని, తాను కోర్టుకు వెళతానని తెలిపారు. పనులు పూర్తి చేయకుండా పంచాయతీ కార్యదర్శికి భవనం ఎలా అప్పగిస్తారని ఆయన ప్రశ్నించారు. వల్లాపల్లిలో వైసీపీలో ఉన్న రెండు వర్గాల మధ్య సచివాలయ భవన ప్రారంభం వద్ద గొడవలు జరిగే అవకాశం ఉందని గమనించిన ఎస్ఐ శివనాగిరెడ్డి సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఎమ్మెల్యే కోన రఘుపతి అవినీతి, అక్రమాలపై

పోరాటం చేస్తా

- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, ఫిబ్రవరి 19: ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన అవినీతి, అక్రమాలపై పోరాటం కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ స్పష్టం చేశారు. బాపట్లలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ డబ్బు మదంతో ఎమ్మెల్యే కోన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. 40 సంవత్సరాలకు పూర్వమే క్విడ్‌ప్రోకో పరిచయం చేసిన ఘనత కోన ప్రభాకరరావుకే దక్కిందన్నారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని పెట్టటానికి రామాలయాన్నే తొలిగించాలనే ఆలోచన చేయటం సిగ్గుచేటు అన్నారు. బాపట్లలో మున్సిపల్ ఎన్నికలు జరగకుండా చేసి మున్సిపాలిటీని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా దోపిడి చేశావని విమర్శించారు. విలీనం అనే కుట్రతో పంచాయతీలకు ఎన్నికలు లేకుండా చేసి అక్కడ కూడా అక్రమాలకు తెరతీశావన్నారు. విద్యాకేంద్రంగా ఉన్న బాపట్లను వైసీపీ నాయకులు గంజాయిహబ్‌గా మార్చారని ఆరోపించారు. మురుగు కాల్వలలో తీసిన సిల్ట్‌ను కూడా ట్రక్కు రూ.3వేలకు కూడా విక్రయించిన ఘనత ఎమ్మెల్యే కోనకే దక్కుతుందన్నారు. ఆలయాల అభివృద్ధి పేరిట విరాళాలు సేకరణ పేరుతో వసూళ్ళు చేస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణ సమయంలో వ్యాపారుల వద్ద పెద్దఎత్తున వసూళ్ళు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములు కొనుగోలు చేయించి బినామీల పేరుతో 70నుంచి 80అడుగుల లోతు ఇసుక తవ్వి విక్రయించి కోట్ల రూపాయలు గడించారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కోన బాధిత సంఘం పెట్టి వసూళ్ళు చేసిన డబ్బుమొత్తం తిరిగి వసూళ్ళు చేస్తామన్నారు. దీనికి అధ్యక్షునిగా తాను ఉంటానని లీగల్‌టీమ్ ద్వారా బాధితులకు అండగా నిలుస్తానన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో తాను చేసిన అభివృద్ధి ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఎమ్మెల్యే కోన చేసిన అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కప్పం కట్టే పరిస్థితి నుంచి బాపట్ల ప్రజలను రక్షిస్తానన్నారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థితో కలిసి నిన్ను ఓడించటానికి కృషి చేస్తానన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే

- ప్రతి నేత, కార్యకర్తకు సముచిత స్థానం
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్
- టీడీపీలోకి చేరికలు

రేపల్లె, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల కారణంగానే ఆపార్టీ నుండి టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం రూరల్ మండలం టీడీపీ అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు, వడ్డిలక్ష్మీజీ ఆధ్వర్యంలో పిరాట్లంక గ్రామ మాజీ సర్పంచ్ మండలి రామ్మోహన్‌రావు, మండలి తారక బ్రహ్మేణేశ్వరరావు, దండా వెంకటేశ్వరరావు, మోపిదేవి బసవారావు, కైతేపల్లి పంచాయతీ నుండి సయ్యద్ జిలాని, రహంతుల్లాఖాన్, సయ్యద్ కరిముల్లా, షేక్ కరిముల్లాసుబాని, సర్దార్ గౌస్, మరో 40 కుటుంబాల వారు టీడీపీలో చేరగా, వారికి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదే విధంగా మండలంలోని బొందలగరువు వైసీపీ సర్పంచ్ వర్రే మహేంద్ర, నిజాంపట్నం మండలం ప్రజ్ఞం గ్రామంలోని వైసీపీకి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరగా వారినీ పార్టీలోకి ఆహ్వానించామని అనగాని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వంతాని మురళీధరరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జీవీ నాగేశ్వరరావు, తాతా ఏడుకొండలు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నేతలకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని

వైసీపీలో వేరుకుంపట్లు

సీఎం సభ ఏర్పాట్లకు మాగుంటను ఆహ్వానించని నేతలు

మంత్రి సురేష్, బాలినేని, చెవిరెడ్డిలే భేటీ

కార్యక్రమానికి దూరంగా మరో ముగ్గురు ఎమ్మెల్యేలు

టీడీపీ, జనసేన కూటమి వైపు గరటయ్య, కృష్ణచైతన్య చూపు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికార వైసీపీలో వేరుకుంపట్ల రాజకీయం తారస్థాయికి చేరింది. పార్టీలో ఉన్న ఎంపీ మాగుంటను ఒంగోలులో సీఎం సభ ఏర్పాట్ల పరిశీలనకు కూడా ఆహ్వానించలేదు. మరోవైపు ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. సీనియర్ నాయకుడు డాక్టరు గరటయ్య, ఆయన కుమారుడు చైతన్యతోపాటు మరికొందరు నేతలు టీడీపీ, జనసేన కూటమి వైపు దృష్టి సారించారు. మంత్రులు నాగార్జున, సురేష్ కొత్త ఇన్‌చార్జిలుగా నియమితులైన నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ పార్టీపరంగా పాలనా బాధ్యతలు చూసిన వారిని కానీ, వారి అనుచరులను కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వైసీపీలో పరిస్థితి అతలాకుతలంగా మారింది.

అభ్యర్థుల మార్పుపై సీఎం జగన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు మరింత వికటిస్తున్నాయే తప్ప ఏమాత్రం కుదుటపడటం లేదు. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఆపార్టీలో నెలకొన్న పరిస్థితులు అందుకు దర్పణం పడుతున్నాయి. పార్టీలోనే ఉన్న ఒంగోలు ఎంపీ మాగుంటతో పాటు ముగ్గురు ఎమ్మెల్యేలను కనీసం కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు ముఖం చాటేస్తున్నారు. జిల్లా, నియోజకవర్గస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు వైసీపీకి గుడ్‌బై చెప్పే వారి సంఖ్య పెరిగిపోతోంది. దీనికితోడు కొత్తగా పార్టీ ఇన్‌చార్జిల బాధ్యతలు చేపట్టిన నాయకులు ఒంటెత్తుపోకడ విధానాన్ని అవలంబిస్తుండటంతో ఆపార్టీలో ఉన్న నాయకులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. కొత్త ఇన్‌చార్జిల పోకడపై ఎక్కడికక్కడ సమావేశాలు ఏర్పాటు చేసుకుని తమ నిరసనను బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు.

కొత్త ఇన్‌చార్జిల ఒంటెత్తుపోకడ


కొత్త ఇన్‌చార్జిలు స్థానిక నాయకులను గౌరవించడం లేదన్న విమర్శలు వైసీపీ నాయకుల నుంచి తీవ్రంగా వినిపిస్తున్నాయి. సంతనూతలపాడు నియోజకవర్గంలో మంత్రి నాగార్జున అయితే అధికారికంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయించుకుని వెళ్లి వస్తున్నారే తప్ప స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వడం లేదు. ఇక ఆయా నియోజకవర్గాలలో స్థానిక నాయకులతో సంబంధం లేకుండానే బదిలీల వ్యవహారాలను నిర్వహిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే వైసీపీ నాయకులు ఉడికిపోతున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం నాగులుప్పలపాడు మండలంలో స్థానిక నాయకులంతా ప్రత్యేకంగా సమావేశమై నాగార్జున వైఖరిని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు గెలిచాక ఏడాదికి ప్రారంభించిన నాయకులను విస్మరించే చర్యలను నాగార్జున తొలి నెలన్నరకే ప్రారంభించారంటూ ఆపార్టీ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలలో పరస్పర బదిలీలతో బాధ్యతలు చేపట్టిన ఎమ్మెల్యేలు రాంబాబు, నాగార్జునరెడ్డిలకు ఎక్కువ ప్రాంతాల్లో స్థానిక నేతల నుంచి చుక్కెదురవుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరై ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమాలలో పాల్గొన్న నాయకులు కూడా ఎమ్మెల్యేలు వారివారి కొత్త నియోజకవర్గాలలో పర్యటనలు ప్రారంభిస్తే ముఖం చాటేస్తున్నారు.

సీఎం సభకు మాగుంటకు లభించని ఆహ్వానం

ఒంగోలు లోక్‌సభ స్థానానికి పోటీచేసే పార్టీ అభ్యర్థిని జగన్ ఇంతవరకూ అధికారికంగా ప్రకటించ లేదు. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇప్పటికీ వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఆయన విషయంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పార్టీ అధినేతల నుంచి జిల్లా నాయకుల వరకూ కొన్ని వ్యాఖ్యానాలు చేసినా మాగుంట నోరుమెదపలేదు. అలాగని నియోజకవర్గానికి కూడా దూరం కాలేదు. ఎప్పట్లాగే వారంలో రెండుమూడు రోజులు ఒంగోలులోనూ, నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల్లోనూ తిరుగుతున్నారు. వైసీపీ అధిష్ఠానం పార్టీ రీజనల్ కోఆర్డినేటర్‌గా తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రకటించింది. ఆయనే ఒంగోలు ఎంపీ అభ్యర్థి అవుతారని అనధికారికంగా సంకేతాలు ఇచ్చింది. దీంతో ఆయన ఒంగోలుకు పదేపదే రావడం, కార్యక్రమాలలో పాల్గొనడం జరుగుతోంది. ఆదివారం కూడా ఆయన ఒంగోలు వచ్చారు. శుక్రవారం ఒంగోలులో జరగనున్న సీఎం కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేనితో మంత్రి సురేష్, చెవిరెడ్డి సమావేశమై సీఎం సభ జయప్రదానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించుకున్నారు. అనంతరం ముగ్గురూ కలిసి వెళ్లి సింగరాయకొండలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కానీ ఒంగోలులోనే ఉన్న ఎంపీ మాగుంటను మర్యాదపూర్వకంగా కూడా ఆహ్వానించ లేదు. సీఎం పర్యటనపై ఆయనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని తెలుస్తోంది. ఆదివారం రాత్రి ఒంగోలులో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాగుంట హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘం తరఫున ఆయన్ను ఆహ్వానించారే తప్ప వైసీపీ పరంగా కానీ, పాలనాపరంగా అధికారులు నిర్వహించే కార్యక్రమాలకు కానీ ఆయన్ను ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో ఒంగోలు లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న మాగుంట అనుచరులు, అభిమానులు క్రమేపీ వైసీపీ కార్యక్రమాలకు దూరమవుతున్నారు. మంత్రులు సురేష్, నాగార్జునలు వారి వారి నియోజకవర్గాలలో నిర్వహించే కార్యక్రమాలకు కూడా మాగుంట అనుచరులు హాజరు కావడం లేదు.

మరో ముగ్గురు ఎమ్మెల్యేలదీ అదే పరిస్థితి

కనిగిరి, దర్శి సంతనూతలపాడు ఎమ్మెల్యేలు మధుసూదన్ యాదవ్, మద్దిశెట్టి వేణుగోపాల్, సుధాకర్‌బాబు నియోజకవర్గాల్లో ఎలాంటి కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదు. కనీసం వారిని పిలవకుండానే అధికారిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు లేకుండానే కొత్త ఇన్‌చార్జిలు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. దీంతో ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉంటూ వారికి మద్దతు తెలుపుతున్న వైసీపీ శ్రేణులు కొత్త ఇన్‌చార్జిలు నిర్వహించే కార్యక్రమాలకు



దూరంగా ఉంటున్నాయి. కొన్ని నియోజకవర్గాలలో అయితే ఎమ్మెల్యేల అనుచరగణాన్ని కార్యక్రమాలకు కూడా ఆహ్వానించడం లేదు. దీంతో వారి వారి అనుచరులు వేరుకుంపట్లతో ముందుకు సాగుతున్నారు.

మహీధర్, ఆమంచిల తీరూ అదే

కొత్త ఇన్‌చార్జిల నియామకం జరిగిన కందుకూరు, పర్చూరు నియోజకవర్గాలలోనూ అదేతరహా పరిస్థితి కనిపిస్తోంది. కొత్త అభ్యర్థి ఇంతవరకూ ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిని కలవలేదు. నియోజవకర్గంలోని పార్టీ శ్రేణులు మాత్రం జగన్ నిర్ణయాన్ని వ్యతిరేకించి దుమ్మెత్తిపోస్తున్నాయి. పర్చూరు నియోజకవర్గంలో కొత్త ఇన్‌చార్జి బాలాజీ, మాజీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌లు కలిసే అవకాశం కనిపించడం లేదు. గత పదేళ్లుగా ఆ ఇద్దరూ చీరాల నియోజకవర్గంలో అటు రాజకీయంగా, ఇటు వ్యక్తిగతంగా విరోధులుగా ఉన్నారు. వారి మధ్య మాటలు కూడా లేవు. బాలాజీ కొత్తగా బాధ్యతలు చేపట్టినా ఆయన్ను పార్టీలోని చాలామంది మర్యాదపూర్వకంగా కూడా కలవడం లేదు.

దర్శి వైపు చైతన్య చూపు

సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గరటయ్య, నిన్న మొన్నటి వరకూ వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు కృష్ణచైతన్యలు వైసీపీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వారు టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గరటయ్యకు అద్దంకితోపాటు పర్చూరు, సంతనూతలపాడు నియోజకవర్గాలలో అనుచరగణం ఉంది. పలువురితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అద్దంకి నియోజకవర్గంలో అయితే పార్టీ యంత్రాంగంలో అత్యధికులు చైతన్యతోనే కలిసి నడుస్తున్నారు. చైతన్యతోపాటు పార్టీ వీడేందుకు సిద్ధమని ఆయన్ను కలిసి చెబుతున్నారు. వీరు టీడీపీ, జనసేన కూటమిలో దర్శి నియోజకవర్గం నుంచి పోటీకి ప్రయత్నాలు చేస్తున్నారు. గరటయ్య అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎక్కువకాలం ప్రస్తుత దర్శి నియోజకవర్గంలోని తాళ్లూరు అద్దంకి సెగ్మెంట్‌లో ఉండేది. అలాగే ముండ్లమూరు మండల ప్రజలతో కూడా ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో దర్శి నియోజకవర్గంలో దీటైన అభ్యర్థిని దించే ప్రయత్నంలో ఉన్న టీడీపీ, జనసేన కూటమి చైతన్యపై దృష్టి సారించి సర్వే చేపట్టింది. ఇక జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాలలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరగడంతో ప్రస్తుతం అలకలు, అసంతృప్తులతో వేరుకుంపటి రాజకీయాలు నడుపుతున్న నాయకులు మున్ముందు వైసీపీకి మరింత షాక్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.



ఎస్సై శ్రీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

వెల్లువెత్తిన నిరసనలు

రాప్తాడు ఘటనపై మండిపడ్డ జర్నలిస్టులు

పలుచోట్ల నిరసన ర్యాలీలు, ధర్నాలు

ఉన్నతాధికారులకు వినతులు

ఒంగోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సోమవారం జర్నలిస్టుల నిరసనలు వెల్లువెత్తాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన సిద్ధం సభలో కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణ రహితంగా దాడి చేసిన విషయం విదితమే. ఆ ఘటనపై జిల్లాలోని జర్నలిస్టులు మండిపడ్డారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన, మీడియాపై దాడులు నిరసిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. పలు ప్రాంతాల్లో వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ర్యాలీలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడంతోపాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలను అందజేశారు. రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు పలుచోట్ల ఈ ఆందోళనలు ఏపీయూడబ్ల్యూజే నాయకుల నేతృత్వంలో సాగాయి. ఒంగోలులో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కనకయ్య నేతృత్వంలో పలువురు జర్నలిస్టులు కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కాపురంలో జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. యూనియన్ సీనియర్ నాయకులు ఏవీ రమణ ఇతరులు పాల్గొన్నారు. పొదిలిలో జర్నలిస్టుల ర్యాలీ, రాస్తారోకో నిర్వహించగా దర్శిలో డీఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కనిగిరి, కొండపి, నాగులుప్పలపాడు సింగరాయకొండ తదితర పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టి రెవెన్యూ, పోలీస్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అలాగే తెలుగుదేశం పార్టీ నేతలు కూడా ఈ పాశవిక దాడిని ఖండించారు. వాస్తవాలను వెలికితీయడాన్ని తట్టుకోలేని వైసీపీ గూండాలు దాడులు చేయడం దారుణమని టీడీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు.

పీఎంశ్రీ పాఠశాలలకు రూ.2.33 కోట్లు మంజూరు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 19 : జిల్లాలోని 15 పీఎంశ్రీ పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం రూ.2.33 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ పాఠశాలల్లో ప్రయోగశాలల నిర్మాణం, పరికరాలకు ఈ నిధులు వినియోగిస్తారు. ఒక్కొక్క ల్యాబ్‌కు రూ.15.58 లక్షల వ్యయం చేస్తారు. ఈ ల్యాబ్‌ల నిర్మాణానికి ఒక్కొక్క పాఠశాలకు మొదటి వాయిదాగా రూ.2లక్షల చొప్పున రూ.30లక్షలు విడుదల చేస్తున్నట్లు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి సంబంధించి స్టీల్, ఇసుక, రాళ్లు, సిమెంట్ కొనుగోలుకు ఈ నిధులను వినియోగించమన్నారు. కొత్త భవన నిర్మాణాలకు మాత్రమే ఈ నిధులు వినియోగించాలన్నారు. జిల్లాలోని గణపవరం కేజీబీవీ, కంభంలోని ఏపీ సాంఘిక గురుకులం, బాలుర ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, సింగరాయకొండ బాలికల ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, అర్ధవీడు జీహెచ్ఎస్, ఇప్పగుంట జడ్పీ స్కూలు, కాకర్ల, కలుజువ్వలపాడు, కామేపల్లి, మర్లపాడు జడ్పీహెచ్ఎస్, ముండ్లపాడు, రాయవరం, ఉప్పలపాడు జడ్పీ హైస్కూళ్లకు ఈ నిధులు మంజూరయ్యాయి.

దొంగ ఓట్ల తొలగింపునకు చర్యలు

ఫాం-7లు అప్లై చేసిన బీఎల్వో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీసీపల్లి, ఫిబ్రవరి 19 : స్థానికేతరులకు ఓటుహక్కు కల్పించి తప్పిదాలకు పాల్పడిన ఎన్నికల అధికారులు కదిలారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో ఉలిక్కిపడ్డ క్షేత్రస్థాయి సిబ్బంది వారి తప్పులను సరిదిద్దుకునేందుకు హడావుడిగా ఫాం-7లు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని బూత్ నెంబరు 216లో స్థానికేతరులైన తెలంగాణకు చెందిన నవీన రామారం, దేవేంద్రరెడ్డి రామారం, పద్మ వీరెడ్డిలకు ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితాలో ఓటుహక్కు కల్పించారు. స్థానిక టీడీపీ శ్రేణులు ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో వీరు ముగ్గురు తమ గ్రామానికి చెందిన వారు కాదని, తెలంగాణకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. కొత్త జాబితాలోనూ దొంగ ఓట్లు అనే కథనాన్ని సోమవారం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీనిపై స్పందించిన అధికారులు స్థానికేతరుల ఓట్లపై ఆరాతీశారు. దీంతో క్షేత్రస్థాయి బూత్ లెవల్ అధికారి ఆ మూడు స్థానికేతర ఓట్లను తొలగించేందుకు ఫాం7లను ఆగమేఘాలపై దరఖాస్తు చేశారు.

వచ్చేనెల 3న పల్స్‌పోలియో

అధికారులు సమన్వయంతో పనిచేయాలని జేసీ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 19 : జిల్లాలో జీరో నుంచి ఐదేళ్లలోపు పిల్లలందరికీ వచ్చేనెల 3వతేదీన జరిగే పల్స్‌పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో సోమవారం సాయంత్రం వైద్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 23,45,687 మంది ఉన్నారని, వారందరికి చుక్కలు వేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు వైద్యాధికారులు మాట్లాడుతూ జిల్లాలో 224 పల్స్‌పోలియో బూత్‌లు, 1591 మొబైల్, 70 ట్రాన్సిట్ బూత్‌లను గుర్తించి వ్యాక్సినేషన్‌ను సరఫరా చేస్తున్నామని ఆయన దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై జేసీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 3న ఎంపికచేసిన కేంద్రాల్లో, 4, 5 తేదీల్లో గృహాలను సందర్శించి మిగిలిపోయిన చిన్నారులకు పోలియో చుక్కలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, ముఖ్యకూడలి ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో రహిత జిల్లాగా ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

స్వాతికి శిక్షా రతన్ అవార్డ్

కురిచేడు, ఫిబ్రవరి 19 : విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి వారికి విద్యలో నైపుణ్యాలను వెలికి తీసే ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఇచ్చే శిక్షా రతన్ అవార్డు 2023-24 విద్యా సంవత్సరంలో కురిచేడు మండలం బోదనంపాడు ఎస్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని వల్లెం స్వాతికి దక్కింది. స్వాతి విద్యార్థులకు సీబీఎస్ఈ పద్ధతిలో సులభమైన రీతిలో పాఠ్యాంశాల కు బోధిస్తారనే పేరు ఉంది. ఆమె సేవలను గుర్తించి ఆమెకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం సంతోషకరమని మండల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు. జాతీయ స్థాయి అవార్డును లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు అధ్యక్షుడు వీవీరమణారావు సోమవారం అందజేశారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు (క్రైం) ఫిబ్రవరి18: రహదారి భద్రత నియమాలను పాటించి ప్రమాదాలు నివారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో సోమవారం రహదారి భద్రత మాసోత్సవాలు ముగింపు సమావేశం జరిగింది. కార్యక్రమానికి రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్లగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయిని తెలిపారు. అదనపు ఎస్పీ శ్రీధర్‌రావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,హెల్మెట్ లేకుండా చోదన చేయకూడదని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు వాడాలని చెప్పారు. రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ గత నెల 20 నుంచి ఈనెల 19 వరకు రహదారి మాసోత్సవాలు నిర్వహించి అనేక కళాశాలలో రహదారి భద్రత పై అవగాహన సదస్సులు ఏర్పాటుచేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు , రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవన్ నాయక్, అర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం, నేషనల్ హైవే మేనేజర్ ఆనందసింగ్, మార్కాపురం ఆర్టీవో అమర్‌నాయక్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ ప్రభాకర్, జగదీష్, రవికుమార్, సురేంద్ర ప్రసాద్ , రామచంద్రరావు, మాధవరావు, జగదీష్, ఏవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు, డ్రైవర్లతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.

సాగని విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం

అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శంకుస్థాపన

నాలుగేళ్లుగా అడుగుపడని పనులు

అమలుకాని ఎమ్మెల్యే మద్దిశెట్టి హామీ

రైతులకు తప్పని లోవోల్టేజీ సమస్య



ఉప కేంద్ర నిర్మాణం కోసం తీసిన గుంతలు

తాళ్లూరు, ఫిబ్రవరి 19 : వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆగమేఘాలపై 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుపై చేసిన ప్రకటనకు నాలుగేళ్ల యింది. దాని నిర్మాణానికి నిధులు కూడా మంజూరయ్యాయంటూ పనులకు అప్పటి ఆ శాఖ మంత్రి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే మద్దిశెట్టి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి 60 గ్రామాలకు చెందిన వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సాక్ష్యాత్తూ అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి జనవరి 2020లో రూ.22.7కోట్ల నిధులతో 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లు పూర్తయినా ఒక్క అడుగు కూడా పడలేదు. తాళ్లూరు పరిసర గ్రామాలకు చెందిన గ్రామాల్లో భూగర్భ జలాలు అధికంగా ఉండడంతో రైతాంగం వ్యవసాయ బోర్లపై ఆధారపడి వ్యవసాయ పంపు సెట్ల మోటార్ల ద్వారా పంట సాగు చే స్తున్నారు. దీంతో విద్యుత్ వాడకం అధికంగా ఉండడంతో జిల్లాలో ఎక్కడా లేని విధంగా అధికంగా ఈ మండలంలో 10 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తాళ్లూరు పరిసరగ్రామాల రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు శ్రద్ధ కనపరిచి శివరాంపురం గ్రామ శివారు తూర్పుగంగవరం-చీమకుర్తి వెళ్లే మార్గంలో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించి విద్యుత్ శాఖకు అప్పగించారు. అప్పటి మంత్రి బాలినేని రైతులపై ప్రే మతో వ్యవసాయ విద్యుత్‌కు సహకారం అందిస్తూ త క్షణమే నిధులు మంజూరు చేస్తూ ఆట్టహాసంగా శంకుస్థాపన కూడా చేశారు. విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ ప్రాంతంలో లక్షలు వెచ్చించి మట్టిని తోలి చదును కూడా చేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చి మొ క్కలతో దర్శనమిస్తోంది. శంకుస్థాపన చేసిన ఏడాదికి కాంట్రాక్టర్ మెటీరియల్‌ను, సామగ్రిని తోలారు. ఆ మెటీరియల్ చోరీకి గురైంది. దీంతో మిగతా సామగ్రి కోసం జీతం ఇచ్చి కాపలాదారుడిని నియమించారు. ప్రస్తుతం అతడికి జీతం చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉప కేంద్ర నిర్మాణం ఎప్పుడు చేస్తారో తమ సమస్యలు ఎప్పుడు తొలిగిపోతాయోనని రైతులు ఎదురుచూస్తున్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుండగా విద్యుత్ ఉప కేంద్ర నిర్మాణం కలగానే మిగులుతుందని రైతులు పెదవివిరుస్తున్నారు.

సీఎం వస్తేనే చేస్తారా!



పాడైపోయిన రోడ్లకు పైపై మెరుగులు

23న వస్తున్నాడని అధికారుల హడావుడి

నగర వీధుల్లో ప్రయాణమంటేనే నరకం.. అడుగడుగునా గుంతలు, ప్రగతి లేదు పాడు లేదు.. ప్రజల నుంచి ఎన్ని విమర్శలు వచ్చినా పాలకులు, అధికారులు నాలుగున్నరేళ్ల నుంచి పట్టించుకున్న పాపాన పోలేదు. కానీ సీఎం వస్తున్నాడని అధికారులు హడావుడిగా నగరంలో ప్యాచ్ పనులు చేపట్టారు. ఈనెల 23న పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేసేందుకు జగన్ ఒంగోలుకు వస్తుండటంతో ఎట్టకేలకు అధికారులు కదిలారు. నగరంలోని పలుప్రాంతాల్లో గోతులమయంగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేస్తున్నారు. అంతా బాగుందని చూపేందుకు పైపై మెరుగులు మొదలుపెట్టారు. దీంతో పలు శివారు కాలనీల ప్రజలు తమ కాలనీల్లో కూడా ప్యాచ్ వర్క్‌లు చేసి, రోడ్లు బాగుచేయాలని కోరుతున్నారు. హడావుడి పనుల్లో తమ కాలనీలను కూడా చేర్చాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం

ఎమ్మెల్యే స్వామి

వైసీపీని వీడి ఆయన సమక్షంలో టీడీపీలో చేరిన 30 కుటుంబాలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. మండలంలో వైసీపీని వీడి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. పాకల పంచాయతీ పరిధి పోతయ్యగారిపాలెంలో వైసీపీకు చెందిన 20 కుటుంబాలు, సోమరాజుపల్లెకు చెందిన 10 కుటుంబాల వారు ఆపార్టీని వీడి ఆదివారం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో తట్టెడు మట్టికూడా పోయలేదని విమర్శించారు. వైసీపీ నాయకులకు దోచుకోవడంపై ఉన్న యావ అభివృద్ధిపై లేదని దుయ్యబట్టారు. టీడీపీ ప్రభుత్వం రాగానే గ్రామాల్లో నిలిచిపోయిన అభివృద్ధిని కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. బీసీ వర్గానికి చెందిన వారు పార్టీలోకి రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన వారిలో వాయిల చిరంజీవి, ప్రభాకర్, కటారి భార్గవ్, అరవింద్, కొడూరి నాగరాజు, రామాంజనేయులు, చెంచంగారి చిట్టిబాబు, గణేష్, కుర్రు గోపి, వసంతకుమార్, రవితేజ, వాయిల అశోక్, నర్రా రామకోటయ్య, వేల్పుల రవికుమార్, ప్రసాద్, సురేష్, పలు కుటుంబాలు వారు ఉన్నారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 19: త్వరలో జరగనున్న ఎన్నికలలో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు కసితో సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు సోమవారం ఓప్రకటన విడుదలచేశారు. సిద్ధం సభల్లో జగన్ చెప్పే మాటలన్నీ శుద్ధ అబద్ధాలు అని అన్నారు. ఎవరిది విధ్వంస పాలనో, ఎవరిది అభివృద్ధి పాలనో ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు బూటకపు ప్రసంగాలు కాదని, చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. 2019లో జగన్‌కు ప్రజలు ఇచ్చిన ఒక్క ఛాన్స్ రాజకీయంగా చివరి ఛాన్స్ అని చెప్పారు. ఓటమి భయం తో బదిలీలు అంటూ 77 మందిని జగన్ మడత పెట్టారని, మిగిలిన వాళ్ళను 50 రోజులలో జనం మడత పెడతారన్నారు.

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సహజ వనరుల దోపిడీ చేస్తూ ప్రతి స్కీమ్ వెనుక స్కామ్ ఉంటుందని ఎమ్మెల్యే రవికుమార్ పేర్కొన్నారు. భారతదేశంలో అత్యంత ధనిక సీఎంగా మారిన జగన్‌కు పేదల జీవితాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. సామాజిక న్యాయం అనే పదం పలికే అర్హత జగన్‌కు లేదని చెప్పారు. రాయలసీమ లోని 52 నియోజకవర్గాలలో ప్రయాణికులను ఇబ్బంది పెట్టి ఆర్‌టీసీ, స్కూల్ బస్సులను లాక్కొని జనాన్ని బలవంతంగా రాప్తాడు సభకు తరలించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలు నిజమైన పెత్తందారు జగన్‌కు, ఐదు కోట్ల ప్రజలకు మధ్య జరుగుతున్న యుద్ధం అని చెప్పారు. జగన్‌రెడ్డి పేరు చెబితే బాబాయిపై గొడ్డలి వేటు, కోడికత్తి శ్రీను, ప్రభుత్వ టెర్రరిజం, క్విడ్‌ప్రో, ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియా, దొంగ ఓట్లు, అప్పుల బాదుడు, పన్నులు, చార్జీల పెంపు, హింసా రాజకీయాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి, రైతుల సబ్సిడీలు నిలిపివేసిన జగన్‌కు రాయలసీమలో సభ పెట్టే అర్హతే లేదని ఎమ్మెల్యే రవికుమార్ విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 19: వరికోత యంత్రం, లారీ పక్కపక్కనే ఢీ కొనటంతో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ వైపు వెళ్తున్న వరికోత యంత్రం సోమవారం రాత్రి అద్దంకి పట్టణం సమీపంలోని నల్లవాగు వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి లారీ క్రాస్ చేసే సమయంలో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కాగా, వరికోత యంత్రంపై ఉన్న విజయకుమార్, నౌషాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. 108లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వెంకటేష్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కృషి

పర్చూరు, ఫిబ్రవరి 19: పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించే విధంగా కృషిచేస్తామని బాపట్ల ఆర్‌డీవో జి.రవీందర్ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలపై పోలీసులు దృష్టిసారించి ఎప్పటికప్పుడు సమాచారం అందించే విధంగా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, మెహర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని గౌరవం



ఉపాధ్యాయులు మన్నం వెంకటసుబ్బారావు, ఒంగోలు ఐజాక్ డేవిడ్‌లను సన్మానిస్తున్న ఎంఈవో 2 సుధాకరరావు, కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి, ఉపాధ్యాయులు

అద్దంకి, ఫిబ్రవరి 19: ఉపాధ్యాయ వృత్తిలో లభించే గౌరవం మరే వృత్తిలో లభించదని ఎంఈవో2 బూదాటి సుధాకరరావు అన్నారు. అద్దంకి పట్టణంలోని రామకృష్ణాపురం, ప్రకాశం ఎయిడెడ్ పాఠశాలలో పనిచేస్తూ త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులు మన్నం వెంకట సుబ్బారావు, ఒంగోలు ఐజాక్ డేవిడ్‌ను సోమవారం స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ చైర్‌పర్సన్ పద్మావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కరి రామయ్య, టంగుటూరి ప్రకాశం, ఆదినారాయణ, గంగాధర్ , పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు తహసీల్దార్‌గా ప్రమీల

ఇంకొల్లు, ఫిబ్రవరి 19: ఇంకొల్లు తహసీల్దార్‌గా ఎం.ప్రమీల సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నగరంలో పనిచేస్తూ ఇంకొలుకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు అందుబాటులోఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు.

బీసీల అభివృద్ధే కమిషన్ లక్ష్యం



అద్దంకిలోని బీసీ బాలికల వసతి గృహంలో భోజనం చేస్తున్న కమిషన్ సభ్యులు గురవాచారి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19: బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కమిషన్ పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ బీసీ కమీషన్‌సభ్యులు కుందుర్తి గురవాచారి అన్నారు. సోమవారం సాయంత్రం అద్దంకి వచ్చిన ఆయన్ని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పలు బీసీ సంఘాల సభ్యులు కలిసి స్వాగతం పలికారు.

అనంతరం అద్దంకిలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను లిఖితపూర్వకంగా తెలుసుకున్నారు. బీసీల సమస్యలను సభ్యులతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఏమన్నా సమస్యలు ఉంటే కమిషన్ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చెన్నుపల్లి శ్రీనివాసచారి, సురేష్, సామ్రాజమ్మ, పొన్నపల్లి బ్రహ్మానందం, సీతారామాంజనేయులు, రవిచంద్రచారి, వీ రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యేలు ఏలూరి, స్వామి

గంగవరం(ఇంకొల్లు), ఫిబ్రవరి 19: రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం పతనం ఖాయమని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సోమవారం ఇంకొల్లు మండలం గంగవరంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ, టీడీపీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఏలూరి, కొండపి ఎమ్మెల్యే స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలలో వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల్లో మార్పుతీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి కీర్తి ప్రతిష్టలు గడించారన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపారన్నారు.ఎన్టీఆర్ కలల సాధనకు కలిసికట్టుగా పని చేయాలని చెప్పారు. గత పదేళ్లలో పర్చూరు నియోజకవర్గంలో వైసీపీకి పది మంది ఇన్‌చార్జ్‌లు మారారన్నారు. ఓటమి భయంతోనే జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని అన్నారు.

కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ అరాచక పాలన చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీని గెలిపించి పసుపు జండా ఎగురవేయాలనే కసి ప్రజల్లో కనిపిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పర్చూరు నియోజవర్గంలో ఏలూరి సాంబశివరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, డాక్టర్ బోడాల శ్యాంసుందర్, పాలేరు రామకృష్ణ, బేతపూడి సురేష్, వీరగంధం, గుంజి వెంకట్రావు, వలేరుమార్క్, కరి వీరాంజనేయులు, బోడెంపూడి సుబ్బారావు, బోడెంపూడి నాగేశ్వరరావు, కొల్లి సుబ్బారావు, బోడెంపూడి వెంకటేశ్వర్లు, నాదెండ్ల రామకృష్ణ, రావిపాటి సంధ్య, కరి నాగేంద్రమ్మ, ఆడె విజయలక్ష్మి, కీసర వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

» రూ.లక్ష నగదు, 60 సవర్ల నగలు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి, ఫిబ్రవరి 19: తాళం వేసిఉన్న బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగి నగదు, బంగారం ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. బాధితుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని న్యూఎస్‌బీఐ కాలనీలో ఎస్‌బీఐలో పనిచేసే పెద్ది అరవింద్ నివాసం ఉంటున్నాడు. భార్య నాగలక్ష్మి బల్లికురవ మండలంలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తుంది. శనివారం సాయంత్రం కుటుంబసభ్యులందరూ కొరిశపాడు మండలం కు ర్రావానిపాలెం వెళ్ళారు. ఆదివారం రాత్రి అద్దంకి రావాలని ప్రయత్నించినప్పటికీ అరవింద్ ఒంగోలు నుంచి ఆలస్యంగా రావటంతో రాలేకపోయారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి బీరువా తెరిచి ఉన్నాయి. రెండు బెడ్ రూమ్‌లలో కప్‌బోర్డులలో దుస్తులు, వస్తువులు చిందరబందరగా పడవేసి ఉన్నాయి. పెళ్లిళ్లకు హాజరుకావాల్సి ఉండటంతో బ్యాంక్ లాకర్‌లో ఉన్న బంగారం మొత్తం ఇటీవలనే తెచ్చి ఇంట్లో ఉంచినట్లు తెలుస్తుంది. దీంతో సుమారు లక్ష రూపాయల నగదు, 60 సవర్ల బంగారం ఆభరణాలు చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. సంఘటనాస్థలాన్ని సీఐ కృష్ణయ్య పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం పరిశీలించి ఆయా వస్తువులపై వేలిముద్రలు సేకరించారు.

చోరీకి పాల్పడేందుకు వచ్చిన యువకుడి కదలికలు న్యూఎస్‌బీఐ కాలనీలో ఓ ఇంటి వద్ద, ఎస్‌ఎస్ లాడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాలలో రికార్డు అయ్యాయి. న్యూ ఎస్‌బీఐ కాలనీలో ఓ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఆ యువకుడు కదలికలు రికార్డు అ య్యాయి. ప్రహరీ గోడ దూకి ఇంటి లోపలకు వెళ్లిన దొంగ వెంటనే బయటకు వచ్చాడు. పక్క బజారులో తాళం వేసి ఉన్న అరవింద్ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. లాడ్జి వద్ద ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించగా బ్యాగ్ తగిలించుకున్న ఓ యువకుడు అర్ధరాత్రి సమయంలో నామ్ రోడ్డులో లారీ నుంచి దిగి న్యూ ఎస్‌బీఐ కాలనీలోకి వెళ్ళాడు. తాళాలు వేసి ఉన్న ఇళ్ళను పరిశీలించి చోరీకి పాల్పడ్డాడు. పై అంతస్తులో మనుషులు ఉన్నా మూడు తలుపుల తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

సీఎం జగన్.. ఓడిపోవడానికి సిద్ధంగా ఉండు..!

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య



మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 19: సీఎం జగన్ సిద్ధం అంటున్నారు, నిజమే.. ప్రజలు కూడా మిమ్మల్ని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నియంత, అరాచక పోకడలు పెచ్చరిల్లిపోతున్నాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాల దాడి పరాకాష్టన్నారు. ఆ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి టీడీపీ అధినేత చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు పూర్తి అభ్యంతరకరమన్నారు. వాటిని ఖండిస్తున్నట్టు చెప్పారు. లోకేష్ ఓటమిపై మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కొన్ని సందర్భాల్లో అనేక పరిస్థితుల ప్రభావం ఉంటుందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. మీరు వైసీపీకి మద్దతు తెలిపిన తరువాత కూడా టీడీపీ శ్రేణులకు మీరు, మీ క్యాడర్ పరిస్థితులకు అనుగుణంగా మరలా టీడీపీకి వస్తామని చెప్పిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఆక్రమంలో చంద్రబాబు ఇంకొల్లు సభలో మాట్లాడటం సమంజసమే కదా అని అన్నారు. లేదంటే మీరు రాజీనామా చేసి తిరిగి గెలుపొంది ఉంటే మిమ్మల్ని చంద్రబాబు ఏమీ అనేవారు కాదన్నారు. చీరాల నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రూ.700 కోట్లు విలువైన అభివృద్ధి పనులు చేసినట్లు రికార్డుల పరంగా ఉందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏం చేశారో చెప్పాలన్నారు. సీఎం జగన్ ఒక బటన్ నొక్కి రూ.10లు ఇస్తే, మరో బటన్ నొక్కి జనాలకు తెలియకుండానే రూ.100 లాగేసుకుంటున్నారన్నారు. అభివృద్ధిలో పోటీ పడాలేకాని అరాచకాల్లో కాదన్నారు.

సమావేశంలో నాయకులు కౌతవరపు జనార్దనరావు, గంజి పురుషోత్తమ్, బొగ్గుల పార్థసారధి, గజవల్లి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌తేజ, రమేష్, సయ్యద్‌బాబు, పులిపాటి శేఖర్, శామ్యూల్, రామయ్య, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరి సమక్షంలో పార్టీలో చేరిన పూనూరు వైసీపీ నాయకులు

టీడీపీలో చేరిన పూనూరు వైసీపీ నాయకులు

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 19: యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో వైసీపీ మద్దతుదారులైన 8వ వార్డు మెంబరు పావులూరి హరిబాబు, బొల్లినేని రామసుబ్బయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేను కలిశారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బోయపాటి సాంబయ్య, బత్తుల రాము, ఈదల అనిల్, ఈదల రవి, మండవ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

» పలుచోట్ల నిరసనలు



చీరాలలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు, వామపక్షాల ప్రతినిధులు




మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 19: ముఖ్యమంత్రి సభలోనే జర్నలిస్టుపై దాడి జరగటం అమానుషమని పలువురు విలేకరులు పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు సినిమాల్లో మాత్రమే చూశామని, నేడు అంతకు మించి దారుణ ఘటనలు ప్రత్యక్షంగా చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభ కవర్ చేస్తున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని అన్నారు. ఈక్రమంలో సోమవారం చీరాలలో పెద్ద ఎత్తున జర్నలిస్టులు, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా ముక్కోణం పార్క్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. తహసీల్దార్ నాసరయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు రావిపాటి శ్రీనివాస్, కోండ్రు కిరణ్, శేషసాయి, నాగరాజు, స్వామినాధ్, చంద్రశేఖర్, వాసు, దిలీప్, అవ్వారు అనీల్, బెజ్జం మణి, బాషా, కమలాకర్, ఒంటరి మణి, సూర్య, నెహేమియా, దుర్గా, టీడీపీ నాయకులు అమర్నాధ్, గజవల్లి శ్రీను, తేజ, మోహన్‌గౌడ్, జనసేన నాయకులు గూడూరి శివరామప్రసాద్, శ్రీను, సీపీఐ, సీపీఎం నాయకులు బాబురావు, కొండయ్య, వసంతరావు, ప్రజాసంఘాల నాయకులు గుమ్మడి ఏసురత్నం, బాబు, జిలానీ తదితరులు పాల్గొన్నారు.


మార్టూరులో.. మార్టూరు, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన ముఖ్య మంత్రి సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీకి చెందిన వ్యక్తులు దాడి చేసిన ఘటనను మార్టూరు యద్దనపూడి మండలాల ప్రింటింగ్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు ఖండించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సీ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దాసం బాలభాస్కర్, కె.రాజ్‌కుమార్, షఫీ, పుట్టా అయ్యన్నబాబు, బెన్నీ, విజయ్, గడ్డం మస్తానవలి, కొల్లా శ్రీను, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్చూరులో.. పర్చూరు, ఫిబ్రవరి 19: జర్నలిస్టుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై విచక్షణారహితంగా చేసిన దాడిపై పర్చూరులో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన తెలిపారు. నల్లబ్యాడ్జిలతో స్థానిక బొమ్మల సెంటర్‌లో దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు రామకృష్ణంరాజు, కొండపాటూరి సుబ్బారావు, తులసి రాఘవరావు, బిరుదు నాగేశ్వరరావు, కొమ్మాలపాటి రవికుమార్, షేక్ అయూబ్, గందు శ్రీనివాసరావు(వాసు), షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

చినగంజాంలో.. చినగంజాం, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని చినగంజాం మండల ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుడు జి.ప్రతాప్‌కుమార్ అన్నారు. రాప్తాడులో ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై మూకుమ్మడిగా జరిగిన దాడి అమానుషమన్నారు. అక్కడ ఉన్న పోలీసుల సమక్షంలో ఈ దాడి జరగడం గర్హనీయమన్నారు. మండల ప్రజా సంఘాల నాయకులు, విలేకరులు డిప్యూటీ తహసీల్దార్ ఎం.సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విలేకరులు కె.శ్రీనివాసరావు, కుక్కల శివారెడ్డి, నాగూర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



చినగంజాం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, విలేకరులు



పర్చూరు బొమ్మల సెంటర్‌లో దాడిని ఖండిస్తూ నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాదరావు

పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 19: సార్వత్రిక ఎన్నికల విధులను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని డీఎస్పీ ప్రసాదరావు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి సోమవారం స్థానిక వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ కళాశాలలో సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ కచ్చితంగా పాటించాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు కృషి చేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్యాలెట్ పేపర్‌లు, ఈవీఎం, వీవీప్యాట్ ఇతర పోలింగ్ పరికారాల భద్రతకు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, కృష్ణయ్య, శివరామకృష్ణారెడ్డి, సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

22న కేఆర్‌కేలో అవగాహన సదస్సు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 19: శింగరకొండ వద్ద గల కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జవహర్ నాలెడ్జి సెంటర్ సహకారంతో ఈనెల 22వ తేది ఉదయం 10 గంటలకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్- కెరీర్ ప్రోస్పెక్ట్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి, పరిసర ప్రాంతాలలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు.

ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం, ఫిబ్రవరి 19: మండలంలోని నీలాయపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహాన్ని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమలో, రాజకీయాల్లో మకుటం లేని రారాజుగా నిలిచిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగుజాతి గొప్పదనాన్ని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య, నీలాయపాలెం సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, ఆసోది సుబ్బారెడ్డి, వడ్లమూడి వెంకయ్య, ఎ.సురేంద్రబాబు, తూమాటి ఆదినారాయణ, యార్లగడ్డ లక్ష్మి, వడ్లమూడి సత్యనారాయణ, దండుప్రోలు తిరుపతిరావు, బొమ్మిడి పిచ్చయ్య, బాలరాజు, నాంచార్యులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు కుమారుడు వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే ఏలూరి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 19: పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో ఈనెల 25న నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి ముస్లిం మైనారిటీ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ జమాలుద్దీన్ పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాల యంలో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. సమావేశంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, అధికార ప్రతినిధి రఫీ, నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.రసూల్, మండల ప్రధానకార్యదర్శి షేక్ ఖాసీం, అబ్దుల్ కలాం ఆజాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టినేని రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, షేక్ హుస్సేన్(ట్విన్స్), సుబానీ, జానీ, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్, మౌలానా ముస్తాక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే బలరాం

బల్లికురవ, ఫిబ్రవరి 19: బల్లికురవ గ్రామానికి చెందిన మండల టీడీపీ నాయకుడు గొట్టిపాటి లక్ష్మయ్య భార్య అనురాధ ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. సోమవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి లక్ష్మయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే, చెన్నుపల్లి గ్రామంలో హైకోర్టు మాజీ జడ్జి రజని తండ్రి తేలప్రోలు వెంకటప్పయ్యను బలరాం పరామర్శించారు. ఈసందర్భంగా అయన యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. బలరాం వెంట పలువురు నేతలు ఉన్నారు.

కొణిదెనలో వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 19: కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాలతో సోమవారం మండలంలోని కొణిదెన గ్రామంలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గత వారంలో బల్లికురవలో జరిగిన కలెక్టర్ స్పందన కార్యక్రమంలో కొణిదెన ఎస్సీ కాలనీవాసులు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో జ్వరాల బారినపడుతున్నట్టు ఫిర్యాదు చేశారు. దీంతో వైద్య సిబ్బంది శిబిరం ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.


అలాగే, చీరాల డీవిజన్ డీఎల్‌పీవో హనుమంతరావు గ్రామంలో పారి శుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాలుడు మృతి బాధాకరం

పర్చూరు, ఫిబ్రవరి 19: పర్చూరు ఇందిరా కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మౌలాలి(అడితి) కుమారుడు (14) మృతి చెందటంతో సోమవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నివాళులర్పించారు. బాలుడు మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. బాలుడు మృతి తనను ఎంతగానో కలచివేసిందన్నారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించినవారిలో టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పట్టణ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, మైనార్టీసెల్ నాయకులు, స్థానిక నేతలు ఉన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న

చీరాల, ఫిబ్రవరి 19: వేగం కన్నా ప్రాణం మిన్న అని ఎంవీఐ రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక 216 జాతీయ రహదారి పక్కనున్న ఎంవీఐ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, నిర్ణీత వేగంతో వాహనాలు నడిపితే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనచోదకులు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ప్రమాదం జరిగితే 108 వాహనం వచ్చే లోపు అందుబాటులో ఉన్నవారు క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స ఎలా చేయాలనేది డాక్టర్ నరేంద్ర వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది జ్యోతి, నాగూర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ ఎన్నికల ఏజెన్సీలు నిర్దేశిత నిబంధనలు ఆకళింపు చేసుకుని విధులను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం ఎన్నికల నోడల్ అధికారులతో ఆయన, ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తేదీ నుంచి ఏజెన్సీలు చురుకుగా పని చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, బ్యాంకులలో నగదు లావాదేవీలు, ఎన్నికలలో ప్రలోభ పరిచే వస్తువుల రవాణా తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.



సిద్ధం అరాచకానికా.. దౌర్జన్యానికా!?

'దేనికి సిద్ధం.. అరాచకానికా!? దౌర్జన్యాలకా!?. ఉద్దేశ పూర్వకంగానే దాడులు జరుగుతున్నాయి. సాక్షాత్తు సీఎం జగన్ పాల్గొన్న సభలోనే ఓ ఫొటో జర్నలిస్టుపై దాడి జరిగిందంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి? ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కఠినంగా వ్యవహరించాలి.' అంటూ విపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ఘటనపై రాజకీయ నాయకులతోపాటు జర్నలిస్టులూ భగ్గుమన్నారు. సోమవారం జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దాడికి కారకులైన వారిని అరెస్ట్ చేయడంతోపాటు కఠినంగా వ్యవహరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- 'రాప్తాడు' ఘటనపై పెల్లుబికిన నిరసన
- వైసీపీ మూకల దాడికి నిరసనగా దద్దరిల్లిన జిల్లా
- ఉద్యమించిన మీడియా, పాత్రికేయ సంఘాలు
- సంఘీభావం తెలిపిన విపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు

నెల్లూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు జరిపిన దాడికి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు మిన్నుముట్టాయి. జర్నలిస్టు సంఘాలు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు రాప్తాడు ఘటనను తీవ్రంగా ఖండించాయి. వైసీపీ రాక్షస పాలనకు పరాకాష్టగా ఈ దాడిని ఉదహరించాయి. రోడ్డెక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనను వ్యక్తం చేశాయి. నెల్లూరు నగరంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గాంధీబొమ్మ వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి కొన్ని పత్రికలు, చానెళ్లపై కక్షగట్టి దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. జర్నలిస్టులను అణగదొక్కాలని, పత్రికా స్వేచ్ఛను హరించాలని ప్రయత్నించిన ఏ ప్రభుత్వమూ, ఏ నాయకుడు ప్రజాస్వామ్యంలో మనుగడ సాధించలేదని గుర్తు చేశారు.

● నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ సర్కిల్ వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఎం సభలోనే విలేకరుల మీద దాడి జరగడం సిగ్గుచేటన్నారు.

● కావలిలో గాంధీ విగ్రహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు జర్నలిస్టులు ర్యాలీ నిర్వహించారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వైసీపీ మూకలను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

● కొండాపురంలో జర్నలిస్టులు తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. బిట్రగుంటలో టీడీపీ నేతలు అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేశారు. బోగోలులో టీడీపీ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి గళం విప్పారు. దుత్తలూరులో టీడీపీ నాయకులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.

● కందుకూరులో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. అల్లరి మూకలను అరెస్టు చేయాలని సబ్ కలెక్టర్, డీఎస్పీలకు వినతి పత్రాలు సమర్పించారు. కందుకూరు టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి బూసి సురేష్‌బాబు తదితరులు ఈ ఘటనను ఖండిస్తూ ప్రకటనలు విడుదల చేశారు. ఉలవపాడు, గుడ్లూరులలోనూ విలేకరులు తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు.

● కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి జర్నలిస్టులకు సంఘీభావంగా విడవలూరులో ర్యాలీ నిర్వహించారు. ఇందుకూరుపేటలో జర్నలిస్టుల ఆందోళనకు జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని ఖండించారు. టీపీ గూడూరులో టీడీపీ, జనసేన నాయకులు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.



నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు


కందుకూరులో డీఎస్పీకి వినతి


నెల్లూరు రూరల్ మండలం జొన్నవాడ క్రాస్ వద్ద సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వామపక్ష నాయకులు


బోగోలులో నల్లరిబ్బన్లు ధరించి


బుచ్చిలో విపక్షాల రాస్తారోకో



కావలిలో నినదించిన జర్నలిస్టులు


విడవలూరులో టీడీపీ ర్యాలీ

జగన్ పిలుపుతోనే...



ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ. చొక్కాలు మడత పెట్టమని సీఎం జగన్ ఇచ్చిన పిలుపుతో రెచ్చిపోతున్న వైసీపీ మూకలు అమాయకుల చొక్కాలను రక్తంతో తడుపుతున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సభలో శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం దేనికి సంకేతం. ఇందుకు పూర్తి బాధ్యత జగనే వహించి, బాధ్యులను అరెస్టు చేయించాలి. మీడియాకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సైతం ప్రభుత్వం హరిస్తోంది.

- బీద రవిచంద్ర, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

వైసీపీ అరాచకాలకు పరాకాష్ట



సీఎం జగన్మోహన్ రెడ్డితో పాటు వైసీపీ నేతల్లో ఓటమి భయంతో కూడిన ఫ్రస్ట్రేషన్ పీక్‌కు చేరింది. అందులో భాగమే దాడికి తెగబడ్డారు. వైసీపీ ప్రభుత్వానికి భారత రాజ్యాంగం అంటే పూర్తిగా లెక్కలేదు. ప్రజాస్వామ్యంలో నాల్గవ స్తంభమైన మీడియాపై దారుణాలకు దిగుతుంటే ఇక సామాన్యులకు రక్షణ ఎక్కడిది. జర్నలిస్టులందరికీ సీఎం జగన్మోహన్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

వారిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి



సీఎం జగన్ నిర్వహించిన రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను విచక్షణా రహితంగా కొట్టిన వారి పై పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేయాలి. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా కఠిన చట్టాలను అమలు చేయాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

రౌడీలకు రాజ్యంగా రాష్ట్రం



రాష్ట్ర ముఖ్యమంత్రి సభలో మీడియా మిత్రుడిపై జరిగిన దాడిని జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా లోపించాయి. రౌడీలకు రాజ్యంగా రాష్ట్రం మారిపోయింది.

- చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి, జనసేన జిల్లా అధ్యక్షుడు

వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే!



వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఆంధ్రజ్యోతి ప్రశ్నిస్తున్నందుకు ఓర్వలేకనే ఈ దాడి జరిగింది. సిద్ధం సభ అంటే దాడులు, దౌర్జన్యాలకు వెనుకాడబోమని ప్రతిపక్ష పార్టీలకు హెచ్చరిక చేస్తున్నట్లుగా శ్రీకృష్ణపై దాడి సంఘటన తెలియజేస్తోంది. పోలీసుల సమక్షంలో విలేకరిపై దాడి చేయడమే కాకుండా పోలీసులపైనే వైసీపీ మూకలు దాడికి యత్నించాయి. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

- అజయ్‌కుమార్, జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి

ఇది రాక్షస చర్య



రాక్షసతత్వాన్ని, రౌడీయిజాన్ని సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారు అనడానికి ఇదే నిదర్శనం. సీఎం పాల్గొన్న సభలోనే ఇలా జరిగితే ఇక మామూలు సభల్లో పరిస్థితి ఏమిటన్నది ఆందోళనకరమే. డీజీపీ వ్యాఖ్యలు సరికాదు. తన పదవిని కాపాడుకునేందుకు మాట్లాడుతున్నాడే తప్ప బాధ్యతకలిగిన అధికారిగా కాదు. జర్నలిస్టులపై దాడికి సుప్రీం కోర్టు తీసుకువచ్చిన చట్టాలను అమలు చేయాలి.

- దామా అంకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి

దాడి దుర్మార్గం



విధులు నిర్వహించే జర్నలిస్టులపై రాజకీయ పార్టీలు దాడులు చేయడం దుర్మార్గం. వాళ్లతో ఇబ్బందులు ఉంటే న్యాయపరంగా చేసుకోవాలే తప్ప ఇలా ప్రత్యక్ష దాడులకు పాల్పడటం సరైనది కాదు. ఇలాంటి ఘటనలు భవిష్యత్ తరాలకు ప్రమాదకర సూచనలు అందిస్తాయి.

- మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి

దాడి అమానుషం



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషం. ఈ దాడి వెనుక వైసీపీ నేతల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిని తీవ్రంగా పరిగణించి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. ఇలా దాడులు చేస్తూ పోతే ప్రభుత్వం మీద కూడా ప్రజలకు మంచి భావన ఉండదు

- చేవూరు దేవకుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

ఫొటోలు అప్‌లోడ్ చేయలేదని 163 మంది హెచ్‌ఎంలకు నోటీసులు

నెల్లూరు (విద్య) : విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారన్న కారణాలతో జిల్లాలోని 163 మంది హెచ్‌ఎంలకు డీఈవో రామారావు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలల్లో పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయని 19 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజనంకు సంబంధించిన ఫొటోలను కొంతకాలంగా అప్‌లోడ్ చేయని 69 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదవుతున్నా పట్టించుకోని 75 మంది హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేశారు. వెంటనే లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు. జిల్లాలో హెచ్‌ఎంలకు నోటీసులు జారీ చేయడం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పరీక్షలున్నాయ్.. విద్యుత్‌కు అంతరాయం కలిగించొద్దు!

● ఎస్ఈ విజయన్



నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 19 : త్వరలో ఇంటర్మీడియెట్, పదవ తరగతి పరీక్షలు జరగనున్న దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికర సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ, అసిస్టెంట్ ఇంజనీర్లతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. 33, 11 కేవీ లైన్లలో పెట్రోలింగ్‌ని పూర్తి చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇక జీఐఎస్ సర్వే పనులు పూర్తి చేయాలని పదేపదే చెబుతున్నా కొన్ని సెక్షన్లలో పనులు పూర్తి కావడంలేదని పేర్కొన్నారు. వరికుంటపాడు, కొండాపురం, జలదంకి, కలిగిరి, రాపూరు, ఓజిలి, కావలి రూరల్ సెక్షన్లలో సర్వే పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంటెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఎంత తేడానో!

- గతేడాదితో పోలిస్తే జిల్లాలో తగ్గిన ఓటర్లు
- కొన్నిచోట్ల పెరుగుదల, మరికొన్ని చోట్ల తగ్గుదల
- కావలిలో అత్యధికంగా 10,327 ఓట్ల తేడా



నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఏటా జనాభా పెరుగుతూ ఉంటుంది. గడిచిన దశాబ్ద కాలంగా జనాభా గణాంకాలు కూడా ఇవే చెబుతున్నాయి. అందుకు తగ్గట్లుగా నే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి. కానీ జిల్లాలో విచిత్రంగా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పెరగకపోగా భారీగా తగ్గింది. 2023లో ప్రచురించిన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 19,14,519 ఉండగా, అది 2024కు వచ్చే సరికి ఆ సంఖ్య 19,08,498గా నమోదైంది. అంటే 6,021 ఓట్లు తగ్గాయి. ఎందుకిలా.. దీనికి కారణమేమిటన్నది ఆసక్తిగా మారింది. కావలి, ఆత్మకూరు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గగా, కందుకూరు, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో మాత్రం ఓటర్ల సంఖ్య పెరిగింది. అత్యధికంగా కావలిలో గతేడాదికి, ఇప్పటికి 10,327 ఓట్లు తగ్గడం అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. గతంలో ఇన్ని డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లు తగ్గిన నియోజకవర్గాల్లో ఉన్నాయా? లేదా ఈ ఏడాదిలో ఇంత మంది చనిపోవడమో లేక వలస వెళ్లడమో చేశారా.. అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నెల్లూరు సిటీ, రూరల్ వంటి అర్బన్ నియోజకవర్గాల్లో ఓటర్ల సంఖ్య పెరిగిందంటే ఆశ్చర్యం లేదు కానీ గ్రామీణ ప్రాంతాల నియోజకవర్గాల్లో భారీగా తగ్గడం ఆశ్చర్యంగా ఉంది. కాగా 2023, అక్టోబరులో ప్రచురించిన ముసాయిదా జాబితాకు, 2024 జనవరిలో ప్రచురించి తుది ఓటర్ల జాబితా మధ్య కూడా ఆశ్చర్యకర సంబంధాలు కనిపిస్తున్నాయి. ముసాయిదా ప్రచురణ సమయంలో జిల్లాలో 19,11,432 మంది ఓటర్లు ఉండగా అదే తుది జాబితాలో 19,08,498 మంది ఓటర్లు ఉన్నారు. అంటే 2934 ఓట్లు తగ్గాయి. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ముసాయిదాకు, తుది జాబితాకు మధ్య ఓటర్ల పెరుగుదల కనిపించగా ఒక్క నెల్లూరు జిల్లాలో మాత్రమే ఓట్లు తగ్గడం గమనార్హం.

నియోజకవర్గం	2023	2024	తగ్గుదల/పెరుగుదల
కందుకూరు	2,21,568	2,26,765	5,197
కావలి	2,44,557	2,34,230	- 10,327
ఆత్మకూరు	2,16,498	2,12,939	- 3,559
కోవూరు	2,65834	2,61,182	- 4,652
నెల్లూరు సిటీ	2,33,237	2,37,736	4,499
నెల్లూరు రూరల్	2,62,399	2,67,750	5,351
సర్వేపల్లి	2,31,863	2,29,139	- 2,724
ఉదయగిరి	2,38,563	2,38,757	194
మొత్తం	19,14,519	19,08,498	- 6,021

సంబరం



ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం నెల్లూరు నగరంలో భారీ ర్యాలీ జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్సీ మైదానం నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ర్యాలీ సాగింది. దేశం గర్వించదగ్గ వ్యక్తి ఛత్రపతి శివాజీ అని, ఆయన ఆశయాల సాధనకు యువత నడుం బిగించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.


పొదలకూరు : చాటగొట్లలో నమూనాలు సేకరిస్తున్న బృంద సభ్యులు

'బర్డ్ ఫ్లూ' విస్తృతిపై ఆరా

- జిల్లాలో కేంద్ర, రాష్ట్ర బృందాల పర్యటన
- వైద్యసేవలపై జీజీహెచ్‌లో పరిశీలన
- కలెక్టర్, డీఎంహెచ్‌వోను కలిసిన బృందాలు

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 19 : జిల్లాలో బర్డ్ ఫ్లూ విజృంభిస్తుండటంతో కేంద్ర, రాష్ట్ర వైద్య బృందాలు సోమవారం జిల్లాలో పర్యటించాయి. ఒకవేళ బర్డ్ ఫ్లూ వ్యాధి మనుషులకు సోకితే తగిన వైద్యసేవలపై దృష్టి పెట్టాయి. ప్రత్యేకించి నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తగిన ఏర్పాట్లను పరిశీలించింది. ఇక్కడ ఎన్ని పడకలు ఉన్నాయి. ఐసీయూలో సదుపాయాలు, మందులు, అందుబాటులో ఉన్న ఆక్సిజన్ వంటి వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఢిల్లీకి చెందిన ఎన్‌సీడీసీ అధికారి డాక్టర్ స్మితాసింగాల్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ గుర్మితాకౌర్, సత్తార్‌జంగ్ ఆసుపత్రి పల్మనాజిస్ట్ శ్రీయాస్ శర్మ, రాష్ట్రానికి చెందిన సర్వైలెన్స్ జేడీ మల్లీశ్వరి, జిల్లా సర్వైలెన్స్ అధికారి భాస్కర్ తదితరులు జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్‌తో సమావేశమై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్, డీఎంహెచ్‌వో పెంచలయ్యను కలిసి జిల్లాలో పరిస్థితిపై చర్చించారు. కాగా, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ, పొదలకూరు మండలం చాటగొట్లలలో బర్డ్ ఫ్లూ వల్ల దెబ్బతిన్న కోళ్లఫారాలను చూశారు. అక్కడ పనిచేస్తున్న వారి నమూనాలు సేకరించి, తిరుపతిలోని స్విమ్స్ ల్యాబ్‌కు తరలించారు.

'సోమశిల'లో 20.011 టీఎంసీల నిల్వ

అనంతసాగరం : సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి జలాశయంలో 20.011 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

రాప్తాడు ఘటనపై జర్నలిస్టుల ఆందోళన

● వెల్లువెత్తిన నిరసనలు ● వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాల మద్దతు ● అధికారులకు వినతులు



కావలి : ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు



కందుకూరు: సబ్‌కలెక్టరు కార్యాలయంలో ఏవోకి వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, ఆందోళనలు చేపట్టారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల పోరాటానికి టీడీపీ, జనసేన, వామపక్షాలు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. వివిధ ప్రజా సంఘాలు మద్దతు పలికాయి. ఆ వివరాలు...

కావలి, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ సోమవారం కావలిలో జర్నలిస్టులు నిరసన తెలిపారు. జర్నలిస్టులందరూ స్థానిక గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అక్కడ నుంచి నినాదాలు చేస్తూ ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యలయం వద్ద ధర్నా చేపట్టి పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రింట్, ఎలక్ట్రానిక్, యూట్యూబ్ చానల్ పాత్రికేయులు పాల్గొన్నారు.

గుడ్లూరు: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని ఖండిస్తూ మండల జర్నలిస్టు సంఘాలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపాయి. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఎం. వెంకటేశ్వర్లు, జర్నలిస్టులు మురళి, మల్లికార్జున, నారాయణ, వీర కృష్ణ, సన్నికుమార్, బాలసుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై చేసిన హత్యాయత్నాన్ని ఖండిస్తూ మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు సోమవారం తహ సీల్దార్ కే రవిబాబుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర సమన్వయ సారధి మిరియం శ్రీనివాసులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

బిట్రగుంట: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటినాగేశ్వరావు అన్నారు. బోగోలు అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం నల్ల రిబ్బన్‌లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు తమ్ముళ్లు ఎల్.సుధీర్‌బాబు, నేతి పిచ్చయ్య, చల్లా క్రాంతికుమార్, శ్యామ్, జయకుమార్, సుబ్బారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. రాప్తాడులో శ్రీకృష్ణపై వైసీపీ నేతలు దాడిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లేల్లపల్లి సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు అంతరాజ్, జాన్సన్‌లు పేర్కొన్నారు.

కొండాపురం: ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం హేయమైన చర్యగా మండల టీడీపీ కన్వీనర్ ఎమ్ ఓంకారం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు పీ.రమేష్, గుడవళ్లూరు సర్పంచి బీ.మాచెర్ల తదితరులు మాట్లాడుతూ జర్నలిస్టుపై దాడిని తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిని శిక్షించాలంటూ మండల జర్నలిస్టు యూనియన్ ఆధ్వర్యంలో టీడీ కోటేశ్వరరావుకు వినతిపత్రం అందచేశారు.

కందుకూరు: రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ గూండాలు పాశవికంగా దాడిచేసి కొట్టడాన్ని నిరసిస్తూ కందుకూరులో సోమవారం జర్నలిస్టులు నిరసన చేపట్టారు. ముందుగా జర్నలిస్టులు ర్యాలీగా వెళ్లి డీఎస్పీ ఎ శ్రీనివాస్, సబ్ కలెక్టరు కార్యాలయం పరిపాలనా అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు ప్రతినిధులు కె హరిబాబు, పి చంద్రశేఖర్, నాదెళ్ల కోటేశ్వరరావు, జి. రమేష్, జి. శ్రీనివాసులు, నాగభూషణం, సుదీర్, కిష్టాపర్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నియంత పాలన జరుగుతుందనడానికి ఇంతకన్నా ప్రత్యక్ష సాక్ష్యాలు అవసరం లేదన్నారు. దాడికి కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలిగిరిలో డీటీ హుస్సేనయ్యకు సోమవారం టీడీపీ నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాకు మహేష్, పూసాల వెంగయ నాయుడు, పాములూరి వరప్రసాద్, బొగ్గవరపు వేణు, కొప్పోలు కొండలరావు, కిలారి కొండపనాయుడు, అంబటి శంకర్ పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మీడియాపై దాడి అమానుషమని, ఇది వైసీపీ నిరంకుశత్వ పాలనకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. అనంతపురంలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీమూకల దాడిని ఖండిస్తూ సోమవారం దుత్తలూరులోని 565 జాతీయ రహదారిపై టీడీపీ నాయకులు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మీడియాపై దాడులు పెరిగాయని, త్వరలో వైసీపీ ప్రభుత్వ పతనం తప్పదన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, ఉదయగిరి మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మహేష్, కృష్ణయ్య, రమణారెడ్డి, శ్రీకాంత్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లూరు : తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పాత్రికేయులు



దుత్తలూరులో 565 జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న చెంచలబాబు, టీడీపీ నాయకులు

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



వింజమూరులో హెచ్‌ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఉదయగిరి, ఫిబ్రవరి 19: ఎయిడ్స్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కళాజాత బృందం సూచించింది. సోమవారం ఉదయగిరి పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ నెల్లూరు వారి కళాజాత బృందం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస క్లబ్ బృందం విజయ్, షక్ మున్ని, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వింజమూరు: స్థానిక బస్టాండు సెంటర్‌లో సోమవారం శ్రీనివాస కళాబృందం వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పి బాబురావు, స్టాలిన్, విజయ్, లింకు వర్కర్ షేక్ మున్ని, పేగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కావలిటౌన్, ఫిబ్రవరి 19: ముసునూరులోని హనుమత్ క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి సోమవారం సింహ వాహన సేవలందించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకుడు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు సింహవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగారు.

వార్డు సభ్యుడి మృతికి సంతాపం

ఉలవపాడు, ఫిబ్రవరి 19: మండలంలోని చాగొల్లు పంచాయతీ వార్డు మెంబరు, ఎస్సీ కాలనీకి చెందిన దన్యాసి శ్రీను(46) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు, శ్రీశైలం బోర్డు మెంబర్ తన్నీరు ధర్మరాజు, గ్రామ సర్పంచి లేళ్లపల్లి లత, పంచాయతీ పాలక మండలి సభ్యులు, గ్రామపెద్దలు శ్రీను మృతదేహానికి నివాళులు అర్పించి సోమవారం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

కావలిటౌన్, ఫిబ్రవరి 19: ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. జేఏసీ డివిజన్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ మంగళవారం చలో నెల్లూరుకు జేఏసీ పిలుపునిచ్చినందున ఉద్యోగులంతా నెల్లూరు కలెక్టరేట్‌కు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో ప్రమీల, మాల్యాద్రి, రాజశేఖర్, పద్మజ, రఫీ పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 19: స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిసాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్వర్ణభారత్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ధ్వజస్తంభ, కలశ ప్రతిష్ఠ, హోమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల సూర్యనారాయణ ఆమెకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం శాంతికల్యాణం నిర్వహించి గ్రామోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



దీపావెంకట్‌కు వెంకటేశ్వరస్వామి చిత్రపటం ఇస్తున్న పెండ్యాల

ఎన్నికల విధులపై ముగిసిన శిక్షణ

ఉదయగిరి, ఫిబ్రవరి 19: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రెండు రోజులుగా ఉదయగిరి మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో జరిగిన ఎన్నికల ఎన్నికల విధులపై శిక్షణ సోమవారం ముగిసింది. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన సెక్టార్, పోలీసు అధికారులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్, కావలి డీఎస్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

● రూ. 69 వేల రికవరీకి ఆదేశం

సంగం, ఫిబ్రవరి 19: మండలంలోని 20 పంచాయతీల్లో 2022 -23 ఆర్థిక సంవత్సరంలో రూ. 4 కోట్లతో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందాలు ఉపాధి హామీ పథకంలో పాల్గొన్న కూలీలను, చేసిన పనులను క్షేత్రస్థాయిలో విచారించారు. మొత్తం 20 పంచాయతీల్లో పనులు జరగగా 16 పంచాయతీల్లో సుమారు రూ. 69వేల మేర అక్రమాలు జరిగాయని సమావేశం దృష్టికి తెచ్చారు. విచారించిన అధికారులు సంబంధిత సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకట్రావ్, ఏపీడీ శంకరనారాయణ, అంబుడ్స్ మెన్ వెంకట్రామిరెడ్డి, ఎంపీడీవో శేషగిరిరావు, ఇన్‌చార్జి ఏపీవో సురేష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి హామి పథకంపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి : సీపీఎం

ఆత్మకూరు, ఫిబ్రవరి 19: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వం సోమశిల రోడ్డు సెంటర్ నుంచి సెయింట్ మేరీ స్కూల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, భూ సేకరణకు రూ.7.80 కోట్ల నిధులు మంజూరుచేసిందని, అందులో రూ. 2.70 కోట్లు భూ సేకరణకు కేటాయించినా ఇప్పటివరకు రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా భూసేకరణకు న్యాయపరమైన నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, జిల్లా కౌలు రైతుసంఘం నాయకుడు జి లక్ష్మీపతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, ఏపీ రైతు సంఘం నాయకుడు లక్కు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

అనంతసాగరం, ఫిబ్రవరి 19: స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, కిసాన్ మోర్చా నాయకులు అల్లంపాటి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా ? : ఇంటూరి

కందుకూరు, ఫిబ్రవరి 19: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, అందుకు మీరు సిద్ధమా ? అని వైసీపీ నాయకులకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సవాల్ విసిరారు. సోమవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో అమలుచేసిన 120 సంక్షేమ పథకాలను జగన్మోహనరెడ్డి అధికారంలోకి రాగానే రద్దుచేశాడని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగినబుద్ధి చెప్పటానికి , కుర్చీ మడతపెట్టి ఆయనను ఇంటికి పంపించటానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, చిలకపాటి మధుబాబు, షేక్ రఫీ, వడ్డెళ్ల రవిచంద్ర, కూనం నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

పొగాకు తోటల పరిశీలన



క్యూరింగ్ పూర్తయిన పొగాకును పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 19: కందుకూరు పొగాకు వేలం కేంద్రాల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం పొగాకుబోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ పర్యటించారు. కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట, మండల కేంద్రమైన పొన్నలూరు, లింగసముద్రం మండలం వీఆర్ కోట, వలేటివారిపాలెం మండలం శాఖవరం గ్రామాల్లో ఆయన పొగాకు తోటలను, క్యూరింగ్ జరుగుతున్న బ్యారన్లను, రేకల్లోని పొగాకుని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన పొగాకు దిగుబడులు వచ్చేలా క్యూరింగ్‌లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం రెండు వేలం కేంద్రాలను సందర్శించారు. అధికారులతో సమావేశాలు నిర్వహించి వేలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆయన వెంట వేలం నిర్వహణాధికారులు రాజగోపాలరెడ్డి, వైన్‌రామ్ మీనా, రైతు ప్రతినిధులు రమణయ్య, రామకృష్ణ, వంకాయలపాటి మాల్యాద్రి, ఎం. లక్ష్మీనరసింహం తదితరులు ఉన్నారు.

సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్

ఆత్మకూరు, ఫిబ్రవరి 19: సాంకేతిక విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు ఆ రంగం వైపు దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆత్మకూరు మున్సిపాల్టీ, మండలంలోని అన్ని పాఠశాలల 8,9,10వ తరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యపై ఏర్పాటుచేసిన టెక్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలను పరిశీలించారు. టెక్ ఫెయిర్ ఏర్పాటుచేసిన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి నాగేశ్వరరావు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో నిర్వహించిన వలంటీర్ల సత్కారం కార్యక్రమంలో పాల్గొని అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తలుపూరుపాడులో విజయీభవ యాత్ర

సంగం : మండలంలోని తలుపూరుపాడు, కొరిమెర్లలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం విజయీభవ యాత్ర నిర్వహించారు. దర్గాలో పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా వేసిన సిమెంట్ రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకుడు షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లాస్థాయి సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి19: పట్టణంలోని అరుంధతీ పాలెం పాఠశాల ప్రాంగణం వద్ద సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి చేవూరు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లాస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కావలి నియోజకవర్గ పర్యటనపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు, పాపయ్య, కొండయ్య, సుకుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 19: కొండాపురంలో ఈనెల 23వ తేదీన జరిగే నియోజకవర్గ స్థాయి బహుజన సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత, గిరిజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కలివెల ఎలిషాకుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ జీ ఓబులరెడ్డి, ఎంపీటీసీ తిరుపతి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు బాలిబోయిన శ్రీనివాసులు, నాయకులు ఇత్తడి రమణయ్య, ప్రసాద్, హజరత్తయ్య, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

యర్రంరెడ్డిపల్లిలో విజయ సంకల్ప యాత్ర

వరికుంటపాడు, ఫిబ్రవరి 19: యర్రంరెడ్డిపల్లి, తోటలచెరువుపల్లి, పెద్దిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, పీఏసీఎస్ చైర్మన్ గుంటుపల్లి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతుల కడుపు కొట్టొద్దు : టీడీపీ

జలదంకి 19: వ్యవసాయానికి ఇవ్వాల్సిన 9గంటల విద్యుత్‌ను 7 గంటలు సరఫరా చేస్తూ వైసీపీ ప్రభుత్వం రైతుల కడుపు కొడుతున్నదని మండల టీడీపీ నాయకులు ఆరోపించారు. మండల పార్టీ అధ్యక్షుడు మధు రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు సోమవారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏఈ కృష్ణకిషోర్‌కు వినతి పత్రం అందించారు. రెండు గంట ల కోతతో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు భాస్కర్‌రెడ్డి, వినోద్ నాయుడు, పెంచలనాయుడు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

మిషన్ మోదీ బైక్ ర్యాలీకి ఘనస్వాగతం



బైక్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఫిబ్రవరి 19: మిషన్ మోదీ బైక్ ర్యాలీకి సోమవారం పట్టణంలో బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురై నుంచి ఢిల్లీ వరకు చేపట్టిన ర్యాలీకి ముసునూరు బైపాస్ రోడ్డు వద్ద బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం మద్దూరుపాడు బైపాస్ వరకు ర్యాలీ సాగింది. యువమోర్చా జిల్లా అధ్యక్షుడు గుత్తా అశోక్‌నాయుడు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మోదీ మరోసారి ప్రధాని కావాలన్న ఉద్దేశంతో ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నవీన్‌కుమార్, సీవీసీ సత్యం, కామినేని ఉదయలక్ష్మి, మందా కిరణ్, వాయుగండ్ల సుధీర్, సవీంద్ర పాల్గొన్నారు.

నృత్య కళాభివృద్ధికి కృషి : బీఎమ్మార్

కావలిటౌన్, ఫిబ్రవరి 19 : నృత్య కళాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావులు తెలిపారు. వెంగళరావునగర్‌లోని లిఖిత నృత్య కళానిలయం పునః ప్రారంభంలో సోమవారం వారు పాల్గొని నృత్యకళా శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కళానిలయం శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధుల నుంచి సాయమందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో లిఖిత తండ్రి, సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, ఉపాధ్యక్షుడు గంధం ప్రసన్న, కనపర్తి రాజశేఖర్, ఖాదర్‌బాషపాల్గొన్నారు.



నృత్యకళా శిక్షణశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, ఎంపీ బీఎమ్మార్

రైతు సంక్షేమమే లక్ష్యం

కావలి రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కావలి మండలం గౌరవరంలో సోమవారం ఆయన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవరంలో 97 విద్యుత్ స్తంభాలను మార్చటంతోపాటు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయించామన్నారు. అనంతరం రూ.7.70 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనీల్ కుమార్, సర్పంచి దేవరపల్లి రాధిక, వైసీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమరా బచ్చు ట్రస్ట్ సేవలు అభినందనీయం

బిట్రగుంట : అమరా బచ్చు చారిటబుల్ ట్రస్ట్ సామాజిక, అధ్యాత్మిక సేవలు అభినందనీయమని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు యాదవ్ అన్నారు. సోమవారం బోగోలు మండలం కొండబిట్రగుంటలో ట్రస్ట్ ద్వారా నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడారు. అనంతరం భక్తు లకు ప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కృష్ణకుమార్, సర్పంచు శ్రీరామ్‌గోపాల్, జడ్పీటీసీ కీర్తన, ఎంపీటీసీ మాధవరెడ్డి, పాలక మండలి సభ్యులు ఓబుల్‌రెడ్డి, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565 జాతీయ రహదారికి పక్కన సోమవారం యాదవ చైతన్య వేదిక నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. చైతన్య వేదిక ఆవరణలో కమ్యూనిటీ హాల్, వసతిగృహం, గ్రంథాలయం నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ్య సభ్యుడు బీద మస్తాన్‌రావు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, బీసీవై పార్టీ వ్యవస్థాపకుడు బోడె రామచంద్రయాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, యాదవ అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు, అన్నా రామచంద్రయ్య, టీటీడీ బోర్డు సభ్యులు నాగం సత్యయాదవ్, టీటీడీ సన్నిధిగొల్ల కిశోర్‌యాదవ్‌తోపాటు నియోజకవర్గంలో పలువురు ప్రజాప్రతినిధులు, యాదవ సోదరులు పాల్గొన్నారు. కాగా, యాదవ చైతన్య వేదిక ఆవరణలో గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, జ్యోతి దంపతులు రూ.5 లక్షల విరాళం ప్రకటించారు.

ఫ్లెక్సీలతో ప్రయాణికుల అవస్థలు

ఉదయగిరి, ఫిబ్రవరి 19: నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం 45 ఏళ్ల క్రితం బస్‌షెల్టర్ నిర్మించారు. కాగా, బస్‌షెల్టర్ చుట్టూ వివిధ రాజకీయ పార్టీల జెండా దిమ్మెలు, ఫ్లెక్సీలు అడ్డంగా ఏర్పాటు చేశారు. నిత్యం అనేకమంది ద్విచక్ర వాహనాలను అడ్డంగా నిలుపుతున్నారు. దీంతో బస్‌షెల్టర్‌లోకి ప్రయాణికులు వెళ్లలేక మండుటెండలో రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. రాత్రి పది గంటల వరకు బస్‌ల కోసం ప్రయాణికులు వేచి ఉంటారు. షెల్టర్‌లో విద్యుత్ లేక, తాగునీరు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఉదయగిరి బస్‌షెల్టర్ చుట్టూ ఉన్న ఫ్లెక్సీలు

పల్లెల్లో పేకాట జోరు

వరికుంటపాడు, ఫిబ్రవరి 19: మండలంలోని పలు గ్రామాల్లో మూడుముక్కలాట మూడు పువ్వులు - ఆరు కాయలుగా సాగుతున్నప్పటికీ పట్టించుకొనే నాథుడే లేడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వరికుంటపాడు, ఉదయగిరి మండలాల శివారు గ్రామాలైన సాతువారిపల్లి-కోటాయపల్లి గ్రామాల సరిహద్దులోని పొలాల్లో కొనసాగిస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. సెలవు దినాల్లో ప్రభుత్వ భవనాలు, పాఠశాలలను సైతం పేకాటకు అడ్డగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.